ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY


శ్రీ పొట్టి శ్రీరాములు
నెల్లూరు
జిల్లా వార్తలు
శుక్రవారం 23 ఆగస్టు 2024

అన్నీ ఖాళీ కుర్చీలే!

నెల్లూరురూరల్ : మాద రాజుగూడూరు సచివాలయంలో నిర్ణీత వేళకు సర్వే అసిస్టెంట్‌తప్ప ఎవరూ రాలేదు. పంచాయతీ కార్యదర్శి, ఇంజనీరింగ్, డిజిటల్ వెల్ఫేర్, వ్యవసాయశాఖ సహాయకులతోపాటు గ్రామ పోలీసు, ఏఎన్ఎం, ఎనర్జీ సహాయకులు, వెటర్నరీ సహాయకుల కుర్చీలు ఖాళీగా ఉన్నాయి. కాకుపల్లి సచివాయంలో 10.45 గంటలకు గ్రామ కార్యదర్శి, వీఆర్వో, ఇంజనీరింగ్, డిజిటల్, వెల్ఫేర్ సహాయకులు మాత్రమే విధుల్లో ఉన్నారు. కలివెలపాళెం పంచాయతీ కార్యదర్శి, ఏఎన్ఎం, ఎనర్జీ కార్యదర్శి, వ్యవసాయ సహాయకులు అందుబాటులో లేరు. కానీ ఏఎన్ఎం, వ్యవసాయ సహాయకులు మాత్రం హాజరు వేసినట్లు తెలుస్తోంది.


ఇక్కడ ముగ్గురే..


నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట) : నెల్లూరులోని పప్పులవీధి పార్కు వద్ద ఉన్న సచివాలయంలో 10.30 గంటలకు అడ్మిన్‌తోపాటు నలుగురు సిబ్బంది హాజరయ్యారు. వచ్చిన వీరు కూడా కబుర్లు చెప్పుకుంటూ కనిపించారు.

ఉదయగిరి మండలం తిరుమలాపురం సచివాలయంలో విధులకు హాజరైన సిబ్బంది




నెల్లూరు : ఫత్తేఖాన్‌పేటలో..

సీతారామపురం : మారంరెడ్డిపల్లి సచివాలయంలో ఇద్దరే!



వచ్చామా.. వెళ్లామా..!

గాడి తప్పిన సచివాలయ వ్యవస్థ

ఆంధ్రజ్యోతి పరిశీలన

నెల్లూరు (ఆంధ్రజ్యోతి), ఆగస్టు 22 : పాలనా రంగంలో కొత్త సంస్కరణల పేరుతో గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన గ్రామ సచివాలయ వ్యవస్థ పనితీరు తీసికట్టుగా మారుతోంది. పర్యవేక్షణాధికారుల ఉదాసీన వైఖరితో సిబ్బంది గాడి తప్పుతున్నారు. సమయపాలన మచ్చుకైనా కనిపించడం లేదు. జిల్లా కేంద్రమైన నెల్లూరులోనే ఇటీవల మధ్యాహ్నానికి సచివాలయానికి తాళం వేసి ఉండటాన్ని కమిషనర్ సూర్యతేజ గుర్తించి, సిబ్బంది ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒక్కో సచివాలయంలో పంచాయతీ కార్యదర్శి, వీఆర్ఓ, ఇంజనీరింగ్ అసిస్టెంట్, డిజిటల్ అసిస్టెంట్, వెల్ఫేర్ అసిస్టెంట్, ఏఎన్ఎం, సర్వేయర్, అగ్రికల్చర్, ఎనర్జీ అసిస్టెంట్, మహిళా పోలీస్, వెటర్నరీ అసిస్టెంట్ ఇలా మొత్తం 11 మంది సిబ్బంది ఉంటారు. గ్రామ కార్యదర్శి సచివాలయానికి అడ్మిన్‌గా వ్యవహరిస్తారు. మున్సిపాలిటీల పరిధిలో అడ్మిన్లు వేరుగా ఉంటారు.

● పాలనా సౌలభ్యం లక్ష్యం

వివిధ పనుల నిమిత్తం ప్రజలు మండల కేంద్రాలకు, మున్సిపల్ కార్యాలయాలకు, పోలీస్ స్టేషన్ల చుట్టూ తిరిగే పని లేకుండా గ్రామాలు, మున్సిపల్ వార్డుల్లోనే అన్ని శాఖలకు సంబంధించిన సిబ్బంది అందుబాటులో ఉండేలా సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేశారు. ప్రతి 4వేల మంది జనాభాకు ఒక సచివాలయం చొప్పున జిల్లా వ్యాప్తంగా 769 సచివాలయాలు ఏర్పాటు చేశారు. పట్టణ ప్రాంతాల్లో 236, గ్రామీణ ప్రాంతాల్లో 533 సచివాలయాలు నడుస్తున్నాయి. ప్రతి సచివాలయాల్లో ప్రజలకు అవసరమైన 11 శాఖల ప్రతినిధులను నియమించారు. ప్రతిరోజు ఉదయం 10.30 గంటలకు అన్ని శాఖల సిబ్బంది కార్యాలయానికి హాజరై అటెండెన్స్ వేసుకోవాలి. వివిధ పనుల కోసం వచ్చే ప్రజల నుంచి వినతులు స్వీకరించాలి. ఫీల్డ్‌కు వెళ్లాల్సిన అవసరం వస్తే ఎక్కడికి, ఏ పని నిమిత్తం వెళుతున్నారో మూమెంట్ రిజిస్టర్‌లో రాసి వెళ్లాలి. సచివాల సిబ్బంది అడ్మిన్ పర్యవేక్షణలో ఉంటారు. మండల పరిధిలోని సచివాలయాలు ఎంపీడీఓలు, పట్టణాల్లో మున్సిపల్ కమిషనర్‌లు పర్యవేక్షణాధికారులుగా ఉంటారు. సిబ్బంది హాజరు, పనితీరు తదితరాలను వీరే పర్యవేక్షించాలి.

● జరుగుతున్నదేమిటి!?

ఎంపీడీఓలు సచివాలయాలను గాలికి వదిలేశారు. సచివాలయాల అడ్మిన్లు సిబ్బందిపై పట్టు కోల్పోయారు. ఫలితంగా సచివాలయాలు సిబ్బందికి అతిథిగృహాలుగా మారిపోయాయి. ఉదయం 10.30 గంటలకు తెరుచుకోవాల్సిన సచివాలయాలు కొన్నిచోట్ల 11 గంటలకు కూడా తెరుచుకోవడం లేదు. ఒకవేళ సమయానికి తలుపులు తెరిచినా సిబ్బంది ఉండటం లేదు. వచ్చినా సంఖ్య మాత్రం ఒకరిద్దరికి మించడం లేదు. సచివాలయాల పనితీరుపై గురువారం ఆంధ్రజ్యోతి బృందం జరిపిన పరిశీలనలో సిబ్బంది హాజరు దారుణంగా ఉంది. ఆంధ్రజ్యోతి పరిశీలించిన సచివాలయాల్లో ఒకటి, అర మినహా మిగిలిన అన్ని చోట్ల 11 మంది సిబ్బందిగాను ఒకరిద్దరు మాత్రమే ఉన్నారు. నెల్లూరు సిటీ, రూరల్, కోవూరు, కావలి, ఉదయగిరి, కందుకూరు, సర్వేపల్లి, కందుకూరు నియోజకవర్గాల్లో సచివాలయాలను ఆంధ్రజ్యోతి బృందం పరిశీలించింది.


అనంతసాగరం సచివాలయం-2లో ఖాళీగా కుర్చీలు


వలేటివారిపాళెం : చుండి సచివాలయంలో డిజిటల్ అసిస్టెంట్ ఒక్కరే!


ఇది సచివాలయమేనా : కలిగిరి మండలం కృష్ణారెడ్డిపాళెంలో ఇదీ వరస


ఉలవపాడు-2 సచివాలయంలో కార్యదర్శి మినహా అంతా గైర్హాజరు


హమ్మయ్య ఇక్కడ ఫర్వాలేదు : సంగం-2 సచివాలయంలో సిబ్బంది

ఇసుక రవాణా ధర నిర్ధారణ

- యార్డ్‌లో టన్ను రూ.370.. వాహన సామర్థ్యం బట్టి చార్జీలు
- ఫిర్యాదులు ఉంటే ఫోన్ చేయండి
- కలెక్టర్ ఆనంద్ వెల్లడి


విలేకరులతో మాట్లాడుతున్న కలెక్టర్, పక్కన ఎస్పీ కృష్ణకాంత్

నెల్లూరు (హరనాథపురం) : ప్రజల సౌలభ్యం కోసం ఇసుక రవాణా చార్జీలను నిర్ధారించినట్లు కలెక్టర్ ఆనంద్ చెప్పారు. గురువారం కలెక్టరేట్‌లోని తిక్కన భవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలోని మర్రిపాడులోని శాండ్ డిపోలో 36 వేల మెట్రిక్ టన్నుల ఇసుక అందుబాటులో ఉందని, రోజుకు వెయ్యి టన్నుల ఇసుక సరఫరా అవుతున్నట్లు చెప్పారు. అయితే, స్టాక్ పాయింట్ దూరంగా ఉండటం వల్ల ధర ఎక్కువగా ఉందని ఫిర్యాదులు వస్తున్నాయని అన్నారు. దీనిపై డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ ద్వారా ఇసుక (సీలింగ్ రేటు) రవాణా చార్జీలను నిర్ధారించినట్లు తెలిపారు. ఇసుకకు సంబంధించి ఫిర్యాదులు ఉంటే టోల్ ఫ్రీ నెం.0861 2943569 కు ఫోన్ చేయాలని కోరారు. స్టాక్ యార్డు వద్ద టన్ను ఇసుక ధర రూ.370గా ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. మర్రిపాడు తహసీల్దారు కార్యాలయం వద్ద బుకింగ్ పాయింట్ ఏర్పాటు చేసి, ఓ ఉద్యోగిని కూడా నియమించినట్లు చెప్పారు. ఇసుక రవాణా చేసే వాహనాలను గనుల శాఖ ద్వారా గుర్తించినట్లు తెలిపారు. ఇసుక కావాల్సిన వారు వాహనాల జాబితాను పరిశీలించి, దాని ప్రకారం లేదా సొంత వాహనాల ద్వారా ఇసుక తీసుకొని వెళ్లవచ్చని అన్నారు. ఇసుక సరఫరా, అధిక ధర వసూలు చేసినా, రవాణాలో అక్రమాలకు పాల్పడినా సెబ్, పోలీసు అధికారులు తగిన చర్యలు తీసుకొంటారని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఎస్పీ కృష్ణకాంత్ పాల్గొన్నారు.

ఇసుక రవాణా ధర ఇలా..

● 10 టన్నుల కెపాసిటీ కలిగిన ఆరు టైర్ల లారీకి..

0-5 కిమీలకు రూ.1500, 6-15 కిమీలకు రూ.1500, 6-30 కిమీలకు రూ.2000, 31-45 కి.మీలకు రూ.3500, 46-60 కి.మీలకు రూ.4500, 60 కిమీల కంటే ఎక్కువ దూరం ఉంటే ప్రతి టన్నుకు ఒక కి.మీకు రూ.9లుగా నిర్ధారించారు.

● 18 టన్నుల కెపాసిటీ కలిగిన పది టైర్ల లారీకి..

0-5 కి.మీలకు రూ. 2000, 6-15 కి.మీలకు రూ.3000, 16-30 కి.మీలకు రూ.5000, 31-45 కి.మీలకు రూ.7500, 46-60 కి.మీలకు రూ. 8500, 60కి.మీపైన ప్రతి టన్నుకు కి.మీకు రూ.7.5 చొప్పున వసూలు చేశారు.

● 21 టన్నుల సామర్థ్యం కలిగిన 12 టైర్ల లారీకి..

0-5కిమీకు రూ.2500, 6-15 కి.మీకు రూ. 4000, 16-30 కిమీకు రూ.6000, 31-45 కిమీకు రూ 8000, 46-60 కిమీకు రూ.10000, అదనపు కిమీకు టన్నుకు రూ. 7.50గా నిర్ధారించారు.

● 4 టన్నుల సామర్థ్యం గల ట్రాక్టర్‌కు..

0-5 కి.మీకు రూ.800, 6-15 కి.మీలకు రూ.1500, 16-30 కి.మీకు రూ.2400, 31-45 కి.మీకు రూ.3000, 46-60 కి.మీకు రూ.3500, అదనపు కి.మీ టన్నుకు రూ.12గా నిర్ధారించారు.

పేలుడుపై గోప్యత ఎందుకో!?

- వివరాలు వెల్లడించని పామాయిల్ ఫ్యాక్టరీ ప్రతినిధులు
- పైగా భారీగా భద్రతా సిబ్బంది మోహరింపు
- జరిగిన ప్రమాదంపై అనుమానాలెన్నో!?
- కానరాని జిల్లా సెక్యూరిటీ శాఖ అధికారులు

ముత్తుకూరు, ఆగస్టు 22 : ముత్తుకూరు మండలం పంటపాలెం పామాయిల్ ఫ్యాక్టరీలో జరిగిన ప్రమాదంపై పలు అనుమానాలు రేకెత్తుతున్నాయి. జరిగిన ఘటనపై వివరాలు వెల్లడించేందుకు పరిశ్రమ యాజమాన్యం వెనుకంజ వేస్తోంది. పైగా గురువారం ఫ్యాక్టరీ భద్రతా సిబ్బందిని భారీగా మోహరించి ఫ్యాక్టరీలోకి ఎవరినీ అనుమతించలేదు. కనీసం ప్రమాదం ఎందుకు? ఎలా జరిగిందనే వివరాలు వెల్లడించేందుకు కూడా పరిశ్రమ ప్రతినిధులు ముందుకు రాలేదు. ప్రమాదవ శాత్తు ఈ పేలుడు జరిగిందా!? మరే ఇతర కారణాలు ఉన్నాయా అనేది సమగ్ర దర్యాప్తు చేస్తేనే వెలుగులోకి వస్తుంది. పామాయిల్ పరిశ్రమలో ఏర్పాటు చేసే నైట్రోజన్ ట్యాంకులు, బాయి లర్లు నాసిరకంగా ఉన్నా, ఒత్తిడి ఎక్కువైనా పేలిపోయే అవకాశాలు ఉన్నాయి. ఈ కోణంలో పరిశీలించాల్సిన జిల్లా సెక్యూరిటీ శాఖ అధికారులు ఎవరూ ఫ్యాక్టరీ పరిసరాల్లో కనిపించకపోవడం గమనార్హం. కనీసం జరిగిన ప్రమా దంపై ప్రాథమిక నివేదికను ఇచ్చేందుకు కూడా ఫ్యాక్టరీ యాజమాన్యం ప్రతి నిధులు, వివిధ శాఖల అధికారులు సిద్ధంగా లేకపోవడం శోచనీయం. మరో వైపు బుధవారం రాత్రి జరిగిన పేలుడుతో చెలరేగిన మంటల్లో కార్మికులు ఎవరైనా మృతి చెందారా లేదా అనే విషయంలో కూడా గురు వారం రాత్రి వరకు స్పష్టత లేదు. ప్రమాదం జరిగిన సమయంలో ఫ్యాక్టరీ లోపల ఉన్న కార్మికులు ఎంతమంది, బయటపడ్డ వారి ఎందరూ అనే లెక్కలు కూడా ఇప్పటివరకు తేలలేదు. మామూళ్ల మత్తులో తేలుతున్న జిల్లా సేఫ్టీ శాఖ అధికారులు ఇప్పటికైనా స్పందించి తగు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.


పేలుడు జరిగిన పామాయిల్ పరిశ్రమ ఇదే!

ఆరని జ్వాల


వీఆర్సీ మైదానంలో డాక్టర్లు, జూడాలు, నర్సుల కొవ్వొత్తుల ప్రదర్శన

నెల్లూరు (వైద్యం) : కోల్‌కతాలోని ఆర్జీ కర్ ఆసుపత్రిలో జూనియర్ వైద్యురాలిపై జరిగిన హత్యాచార ఘటనను నిరసిస్తూ జిల్లాలో ఆందోళనలు కొనసాగుతున్నాయి. నగరంలోని ప్రభుత్వ సర్వజన వైద్యశాల వద్ద జూనియర్ డాక్టర్లు గురువారం కూడా రిలేనిరాహార దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా జూనియర్ డాక్టర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పీర్స్ జోయల్ మాట్లాడుతూ విధుల్లో ఉన్న డాక్టర్ల రక్షణకు తీసుకునే చర్యలపై చట్టం చేసే వరకు పోరాటం ఆగదన్నారు. అలాగే, నగరంలో వీఆర్సీ మైదానంలో జుడాల తో పాటు పలు సంఘాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు కొవ్వొత్తు లతో ప్రదర్శన చేసి మృతి చెందిన జూనియర్ వైద్యురాలికి నివాళులర్పించారు. యూటీఎఫ్, జనవిజ్ఞాన వేదిక, ఐద్వా మహిళా సంఘం నాయకులు, నర్సింగ్ కళాశాల, నారాయణ మెడికల్ కళాశాల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

అశ్వారూఢుడైన వెంకయ్యస్వామి



వెంకటాచలం, ఆగస్టు 22 : ఆరాధనోత్సవాల్లో భాగంగా గురువారం ఉదయం వెంకయ్యస్వామి అశ్వారూఢుడై గొలగ మూడి గ్రామంలో విహరించారు. నిత్య పూజల అనంతరం జరిగిన ఉత్సవంలో భక్తులు భారీగా పాల్గొన్నారు. రాత్రి పెద్ద శేషవాహనంపై స్వామివారు విహరించారు. భక్తులు, గ్రామస్థులు వెంకయ్య స్వామికి కర్పూర నీరాజనాలు అందించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కాగా, శుక్రవారం ఉదయం సింహ, రాత్రి గరుడ వాహనసేవ జరుగుతుందని ఆశ్రమ ఈవో బాలసుబ్రహ్మణ్యం వెల్లడించారు.

'కేఎన్ఆర్' ఘటన.. ముగిసిన విచారణ

- ఉన్నతాధికారులకు ప్రాథమిక నివేదిక
- పాఠశాల హెచ్‌ఎంపై సస్పెన్షన్ వేటు

నెల్లూరు(విద్య), ఆగస్టు 22 : నెల్లూరులోని కేఎన్ఆర్ పాఠశాలలో నిర్మాణంలో ఉన్న భవనం షన్‌షేడ్ కూలి విద్యార్థి గురుమహేంద్ర (14) మృతి చెందిన ఘటనపై చేపట్టిన విచారణ ముగిసింది. ప్రాథమిక నివేదికను విద్యాశాఖ అధికారులు కలెక్టర్, విద్యాశాఖ ఆర్జేడీకి అందజేశారు. జరిగిన ఘటనపై పూర్తిస్థాయి విచారణకు నెల్లూరు డిప్యూటీ ఈవో ప్రసన్నలక్ష్మి, డైట్ కళాశాల లెక్చరర్ వెంకటేశ్వరరావు, డీసీఈబీ కార్యదర్శి రామ్‌కుమార్‌తో త్రీమెన్ కమిటీ ఏర్పాటు చేశారు. వీరు పాఠశాలలో పూర్తిస్థాయిలో విచారించారు. గత నెల 26వ తేదీన ఘటన ఎలా జరిగింది? ఆ సమయంలో ఎవరెవరు ఉన్నారు. తదితర అంశాలపై విచారించారు. విద్యార్థి మృతికి గల కారణాలపైనా ఆరా తీశారు. అలాగే హెచ్ఎం తన సొంత నిర్ణయం తీసుకుని 6 నుంచి 9వ తరగతి వరకు 429 మంది విద్యార్థులకు ప్రాథమిక పాఠశాలలో తరగతులు ఏర్పాటు చేయడం, కొన్ని సబ్జెక్టులు మాత్రమే బోధన అందిస్తూ కాలం వెళ్లదీస్తున్నట్లు విచారణలో తేలింది. అందరికీ విద్య అనే నినాదం ఇక్కడ అమలు కావడం లేదన్నది గుర్తించారు. హెచ్ఎం క్రమశిక్షణా రాహిత్యంగా వ్యవహరించి సరైన వసతులు లేని ప్రాంతంలో తరగతులు నిర్వహించడాన్ని కూడా గుర్తించారు. విద్యార్థులు కూడా తమకు సరైన బోధన జరగడం లేదని కమిటీ దృష్టికి తెచ్చారు. దీనిపై మరింత లోతైన విచారణ జరగాల్సి ఉందంటూ ఉన్నతాధికారులకు నివేదికలు అందచేశారు. ఈ నివేదిక ఆధారంగా కేఎన్ఆర్ నగర పాలక ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కే.విజయ ప్రకాష్‌ను సస్పెండ్ చేస్తూ విద్యాశాఖ ఆర్జేడీ బి.లింగేశ్వరరెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ విచారణ మరింత సమగ్రంగా జరుగుతుందని, విచారణ పూర్తయ్యే వరకు అధికారుల ముందస్తు అనుమతి లేకుండా జిల్లాను విడిచి హెచ్ఎం వెళ్లకూడదని ఆదేశాలు జారీ చేశారు.

అక్రమ లేఅవుట్లపై కొరడా

- అనధికార లేఅవుట్ల వివరాలు వెల్లడిస్తున్న ప్రభుత్వం
- నుడా పరిధిలో 32, నెల్లూరులో 40, కావలిలో 18
- ఆ లేఅవుట్లలో కొనుగోలు చేయవద్దని హెచ్చరిక
- పెనాల్టీలు వసూళ్లకు నోటీసుల జారీ


కావలి : మద్దూరుపాడులో వేసి ఉన్న అక్రమ లేఅవుట్

నెల్లూరు, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ హయాంలో పుట్టగొడుగుల్లా పుట్టుకొచ్చిన అక్రమ లే అవుట్లపై అధికార యంత్రాంగం కొరడా ఝుళిపిస్తోంది. నాలా కన్వర్షన్ చేయకుండా, నుడా అనుమతులు తీసుకోకుండా, కనీస ప్రమాణాలు పాటించకుండా లేఅవుట్లు వేసి ప్రభుత్వ ఖజానాకు భారీగా గండికొట్టడమే కాకుండా ప్రజలను కూడా మోసం చేశారు. వీటిపై వైసీపీ ప్రభుత్వం కనీస దృష్టి పెట్టిన పాపాన పోలేదు. అయితే ఎన్డీయే కూటమి అధికారంలోకి రాగానే అక్రమ లేఅవుట్లపై దృష్టి పెట్టింది. వాటి గుట్టు విప్పేందుకు ప్రత్యేక కమిటీని వేసి, విచారణ పూర్తయ్యాక ఇప్పుడు తదుపరి చర్యలకు పూనుకుంది. అక్రమలేఅవుట్ల వివరాలను ప్రకటనల ద్వారా బహిర్గతం చేస్తోంది. ఈ లేఅవుట్లలో ప్లాట్లు కొనుగోలు చేస్తే భవిష్యత్తులో ఎదురయ్యే ఇబ్బందులను తెలియజేస్తోంది. ఎవరూ ఇక్కడ కొనుగోళ్లు చేయవద్దంటూ హెచ్చరిక చేస్తోంది. వైసీపీ ప్రభుత్వం చివరి ఏడాదిలో వెలసిన అక్రమలేఅవుట్ల వివరాలను ఇప్పటికే నుడా ప్రకటించింది.

● వెలుగులోకి వైసీపీ నేతల బాగోతం

అక్రమ లేఅవుట్ల వివరాలను అధికారులు యజమానుల పేర్లతో సహా ప్రచురిస్తుండటంతో వైసీపీ నేతల అక్రమాల పుట్ట పగులుతోంది. నెల్లూరు పట్టణాభివృద్ధి సంస్థ (నుడా) జిల్లావ్యాప్తంగా 32 లేఅవుట్ల వివరాలు ప్రకటించగా, నెల్లూరు కార్పొరేషన్ 40, కావలి మున్సిపాలిటీ 18 లేఅవుట్ల వివరాలను ప్రచురించాయి. అందులో అనేక మంది వైసీపీ నేతల పేర్లు కనిపిస్తున్నాయి. కొందరు వైసీపీ ముఖ్య నేతల బినామీల పేర్లు కూడా ఈ జాబితాలో ఉండటం గమనార్హం. ఈ జాబితా ఆధారంగా అధికార యంత్రాంగం తదుపరి చర్యలకు సిద్ధమవుతోంది. ఈ లేఅవుట్లకు జరిమానా విధించేందుకు నోటీసులు జారీ చేస్తోంది. ప్రభుత్వానికి చెల్లించాల్సిన పన్నులతోపాటు వంద శాతం జరిమానా విధిస్తూ ఇప్పటికే కొందరు యజమానులకు నుడా అధికారులు నోటీసులు కూడా అందించారు. రెవెన్యూ అధికారులు ఇదే మాదిరిగా నాలా కన్వర్షన్‌కు సంబంధించి జరిమానాలు వసూలు చేయాల్సి ఉంది. ఇది జరిగితే ప్రభుత్వ ఖజానాకు రూ.కోట్లలో ఆదాయం సమకూరుతుంది.

● పొదలకూరులో రూ.10 కోట్ల ఆదాయం

పొదలకూరులో వేసిన అక్రమ లేఅవుట్ ఇప్పుడు సక్రమం అవుతోంది. ఫోర్జరీ సంతకాలతో డీటీసీపీ అప్రూవల్ ఉన్నట్లు ప్రజలను నమ్మించి కొందరు లేఅవుట్ వేశారు. సుమారు 18 ఎకరాల్లో వేసిన ఈ లేఅవుట్ విలువ రూ.వందల కోట్లలోనే ఉంది. ఈ లేఅవుట్ వేస్తున్నప్పుడే ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి దృష్టికి ఈ వ్యవహారం రావడంతో ఆయనకలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. విచారించిన అధికారులు ఆ లేఅవుట్‌కు అనుమతులు లేవని నిర్ధారించి ఫోర్జరీ సంతకాలతో అనుమతులు సృష్టించినందుకు పోలీసు కేసు కూడా నమోదు చేశారు. అయితే ఇప్పుడు సదరు లేఅవుట్ యజమానులు తప్పును ఒప్పుకొని ప్రజలకు బహిరంగ క్షమాపణ చెప్పడం విశేషం. అదే సమయంలో నుడా అనుమతులతో లేఅవుట్ వేసేందుకు సిద్ధమయ్యారు. తద్వారా ఈ లేఅవుట్‌లో రోడ్లు పెద్దవి అవ్వడంతో పాటు ప్రజా అవసరాల కోసం పది శాతం స్థలం అంటే 1.80 ఎకరాలను పంచాయతీకి అప్పగించారు. అలానే నుడా, రెవెన్యూ శాఖల అనుమతుల ద్వారా ప్రభుత్వ ఖజానాకు రూ.కోట్ల ఆదాయం లభించింది. మొత్తంగా పొదలకూరులో అక్రమ లేఅవుట్ సక్రమంగా మారిన ఫలితంగా ప్రభుత్వం, ప్రజలకు సుమారు రూ.10 కోట్ల లాభం వచ్చిందని అధికారులు చెబుతుండటం విశేషం.

నెల్లూరులో 40 లేఅవుట్లు

- సిటీ నియోజకవర్గంలో 7, రూరల్‌లో 33
- వివరాలు వెల్లడించిన కార్పొరేషన్ కమిషనర్

నెల్లూరు (సిటీ) : నెల్లూరు నగర కేంద్రంగా అక్రమ లేఅవుట్లు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. ఖాళీ స్థలం కనిపిస్తే చాలు లేఅవుట్‌గా తీర్చిదిద్దేసి అమ్మేస్తున్నారు. కొందరు రియల్టర్లు మాఫియా అవతారమెత్తి కనీస నియమ, నిబంధనలు కూడా పాటించకుండా ప్లాట్ల వ్యాపారానికి తెరలేపుతున్నారు. ఈ క్రమంలో క్షేత్ర స్థాయిలో ఆరా తీసిన కమిషనర్ సూర్యతేజ నగర పరిధిలో 40 అక్రమ లేఅవుట్లను గుర్తించారు. ఇందులో సిటీ నియోజకవర్గంలో 7 ఉండగా మిగిలనవన్నీ రూరల్ నియోజకవర్గంలోనే ఉన్నట్లు తేల్చారు. వీటిల్లో ఎవరూ ప్లాట్లు కొనడం, అమ్మడం చేయవద్దని హెచ్చరించిన ఆయన అందుకు భిన్నంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సూచించారు. ఈ మేరకు అక్రమ లే అవుట్ల జాబితాను గురువారం అధికారికంగా విడుదల చేశారు.

అనధికార లేఅవుట్లలో ప్లాట్లు కొనొద్దు

నుడా అనుమతులు లేని అనధికార లేఅవుట్లలో ప్లాట్లు కొనుగోలు చేయవద్దు. భవిష్యత్‌లో ఇళ్లు నిర్మించుకునేందుకు, మౌలిక వసతులకు ఇబ్బందులు ఏర్పడుతాయి. అనధికార లేఅవుట్ల వివరాలను ప్రజలకు తెలియజేస్తున్నాం. ఈ లేఅవుట్లకు జరిమానాలు విధిస్తాం. ఇప్పటికే కొన్నింటికి ఆయా స్థానిక సంస్థల ద్వారా నోటీసులు కూడా జారీ చేశాం. ప్రభుత్వ నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవు.

\- టీ బాపిరెడ్డి, నుడా వీసీ

ప్రణాళికలతోనే గ్రామాల అభివృద్ధి

- నేడు గ్రామసభల నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వ ఆదేశం
- ఉపాధి, అభివృద్ధి పనులకు ప్రణాళికల తయారీ
- సర్పంచి అధ్యక్షతన పనుల గుర్తింపునకు సన్నాహాలు

సంగం, ఆగస్టు 22: పల్లెలు దేశానికి పట్టుకొమ్మలు. గ్రామాలు అభివృద్ధి చెందితే రాష్ట్రం, దేశం అభివృద్ధి చెందుతుంది. తద్వారా మహాత్మాగాంధీ కలలుగన్న గ్రామ స్వరాజ్యాన్ని సాధించవచ్చని ప్రభుత్వం నిర్ణయించింది. ఆ మేరకు శుక్రవారం జిల్లా వ్యాప్తంగా 722 పంచాయతీల్లో సర్పంచ్‌ల అధ్యక్షతన గ్రామసభలు నిర్వహించి ఉపాధి, అభివృద్ధి పనులకు ప్రణాళలు తయారీకి సిద్ధం చేయాలని ఆదేశాలు జారీ చేసింది.

గ్రామాల్లో పనుల గుర్తింపు..

ఈ ఆర్థిక సంవత్సరంలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ మెటీరియల్ కాంపోనెంట్‌తో సీసీ రహదారులు, సీసీ డ్రైన్లతో పాటు నిబంధనల మేరకు ఇతర అభివృద్ధి పనులు చేయాలని నిర్ణయించారు. ఆయా గ్రామ సభలకు సర్పంచ్ అధ్యక్షతన పంచాయతీ కార్యదర్శి నేతృత్వం వహించాల్సి ఉంది. ఈ సభలకు ఉపాధి హామీ వేతనదారులు, గ్రామపెద్దలు, యువకులు, మహిళలు, డ్వాక్రా సభ్యులు హాజరై ఆయా గ్రామాల్లో కావాల్సిన అవసరాలను గుర్తించాల్సి ఉంది. సీసీ రోడ్లు, డ్రైనేజీలే కాకుండా అవసరమైతే గ్రావెల్ రహదారులు ఈ మెటీరియల్ కాంపోనెంట్‌తో చేసే అవకాశాలున్నాయి. రైతులకు అవసరమైన పొలాల రహదారులు, పాఠశాలలకు ప్రహరీలు, ఉద్యాన రైతులకు సంబంధించి ప్రోత్సాహకాలు, పశువులు, మేకలకు సంబంధించి షెడ్లు ఏర్పాటు, రైతులు తమ మెట్ట చేలల్లో భూగర్భ జలాలు వృద్ధి చెందడానికి వర్షపునీరు వృధా పోకుండా గట్ల వెంబడి కందకాల ఏర్పాటు, చెరువుల్లో పూడికతీత పనులు, గట్ల వెంబడి కొబ్బరి, టేకు, ఎర్రచందనం మొక్కలు ఏర్పాటు చేసుకోవడం, పండ్ల తోటల చుట్టూ రింగ్ ట్రెంచ్లు ఏర్పాటుకు ఈ నిధులు మంజూరు చేస్తారు. గుర్తించిన పనులకు ఉపాధి హామీ శాఖ ఏర్పాటు చేసిన బ్లూ ఫ్రాగ్ యాప్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంది. గ్రామాల అభివృద్ధి కోసం ఉపాధి హామి పథకంలో మెటీరియల్ కాంపోనెంట్ నిధులు వినియోగించనున్నారు. ఇప్పటికే జిల్లాలో ఈ ఆర్థిక సంవత్సరంలో పశుసంవర్ధకశాఖతో కలిసి ఉపాధి పథకంలో పశువులు, గొర్రెలు, మేకలు, కోళ్ల షెల్టర్ల నిర్మాణం చేపట్టాలని నిర్ణయించారు.

> **గ్రామసభలు ఇలా..**
>
> గ్రామసభల నిర్వహణకు మండలస్థాయిలో ఉపాధి సిబ్బందికి ఎంపీడీవోలు, ఏపీవోలు అవగాహన కల్పిస్తూ సమాచారాన్ని అందించారు. 23న గ్రామ సర్పంచ్ అధ్యక్షతన సంబంధిత పంచాయతీ కార్యదర్శి గ్రామసభ నిర్వహించి ప్రత్యేక రిజిస్టర్ నిర్వహణ తీర్మానాలు చేయాల్సి ఉంది. ప్రతి పంచాయతీలో విధిగా గ్రామసభలు నిర్వహణకు ముందుగా ప్రచారం చేయాలి. డ్వామా సూచించిన పనులను గుర్తించి పంచాయతీల వారీగా అమలు పర్చాల్సి ఉంది. వ్యవసాయ పనులతో పాటు లబ్ధిదారులకు సంబంధించిన వాటికి మొదటి ప్రాధాన్యత ఇవ్వాలి. ఉపాధి నిధులతో పనులు నిర్వహించే శాఖల అధికారులు విధిగా హాజరుకావాల్సి ఉంది. మండలాలు, పంచాయతీల వారీగా ప్రతిపాదించిన పనుల వివరాలను సంబంధిత ఉపాధి సిబ్బంది యాప్‌లో పొందుపర్చాలి. ఈ ప్రతపాదనలను మండల పరిషత్, జడ్పీ, కలెక్టర్, ప్రాజెక్టు డైరెక్టర్ ద్వారా పరిపాలన అనుమతులు పొందాల్సి ఉంది.

కమ్యూనిటీ సోక్‌పిట్ నిర్మాణం

గ్రామాల్లో మురుగునీటి కాలువల నిర్మాణం చేపట్టేందుకు అవకాశంలేని ప్రదేశాల్లో కమ్యూనిటీ సోక్‌పిట్ నిర్మాణం చేయడం వల్ల పారిశుధ్యం మెరుగుపడుతుందని చెబుతున్నారు. పంచాయతీ స్థలాన్ని గుర్తించి ఈ నిర్మాణం చేపట్టడానికి ఉపాధి నిధులను కేటాయించనున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో సరైన డ్రైనేజీ వ్యవస్థ లేని చోట్ల పారిశుధ్యం మెరుగుపరచడానికి రూ.5 వేలతో వ్యక్తిగత ఇంకుడు గుంత నిర్మాణాలకు ముందుకు వచ్చినవారికి నిధులు కేటాయించనున్నారు.

సచివాలయ ఉద్యోగులకు బాధ్యత

గ్రామసభలకు ఎక్కువ మంది ఉపాధి కూలీలు, రైతులు, గ్రామస్థులు పాల్గొనేలా చేసే బాధ్యతను సచివాలయ ఉద్యోగులకు కట్టబెట్టారు. అందరికి అవగాహన కల్పించి గ్రామసభల విజయవంతానికి కృషిచేసే బాధ్యతలను సచివాలయ ఉద్యోగులందరూ సమిష్టిగా తీసుకోవలని మండల అధికారులు సూచించారు. ఇప్పటికే ఆ కార్యక్రమంలో నిమగ్నమయ్యారు. గ్రామాల్లో ముందుగా దండోరా వంటి కార్యక్రమాలు చేపట్టారు.

చైన్ స్నాచింగ్ నిందితుల అరెస్టు



నిందితులతో డీఎస్పీ వేణుగోపాల్, సీఐ, ఎస్ఐలు

ఏఎస్‌పేట, ఆగస్టు 22: ఇటీవల రాజవోలు గ్రామంలో కరెటి పెంచలమ్మ అనే మహిళ మెడలో బంగారు గొలుసు అపహరించి పారిపోయిన నిందితులను అరెస్టు చెసినట్లు ఆత్మకూరు డీఎస్పీ వేణుగోపాల్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. నెల్లూరు అరుంధతివాడకు చెందిన బద్దిపూడి నాగేంద్ర, బిట్రగుంటకు చెందిన రాజశేఖర్‌లు చెడు వ్యాసనాలకు బానిసై అప్పులపాలైయ్యారు. సులభ మార్గంతో డబ్బులు సంపాదించాలని తెలిసిన వారి నుండి బైక్‌ను తీసుకొని ఈ నెల 19న రాజవోలుకు వచ్చి అక్కడ రోడ్డులోని అంగడి వద్ద ఉన్న మహిళ మెడలోని 20గ్రాముల బంగారు గొలుసును లాక్కొని పరారీ అయ్యారు. ఈ మేరకు బాధితురాలు పెంచలమ్మ ఏఎస్‌పేట పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఎస్ఐ ప్రసాద్ కేసు నమోదు చేశారు. డీఎస్పీ నేతృత్వంలో కేసు సంగం సిఐ వేమారెడ్డి, ఏఎస్‌పేట ఎస్ఐ ప్రసాద్‌రెడ్డి, సిబ్బంది కేసును చేధించి నిందితులతో పాటు బంగారు గొలుసు, బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు.

జిల్లాలో సీఐల బదిలీలు

నెల్లూరు (క్రైం) : గుంటూరు రేంజ్ పరిధిలో పలువురు ఇన్‌స్పెక్టర్లను బదిలీ చేస్తూ రేంజ్ ఐజి సర్వేశ్రేష్ఠ త్రిపాటి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లాలో ఎస్సీ, ఎస్టీ సెల్-1 సీఐ ఆర్ సురేష్‌బాబును రేపల్లె రూరల్ సర్కిల్‌కు బదిలీ చేశారు. మెరైన్‌లో ఉన్న ఆర్‌ఎస్ కిషోర్‌కుమార్‌ను వేదాయపాలెం సీఐగా, రేంజ్ వీఆర్‌లో ఉన్న బి పాపారావును కావలి రూరల్ సీఐగా బదిలీ చేశారు. బదిలీ అయిన వారు వెంటనే బాధ్యతలు చేపట్టాలని ఐజీ ఆదేశించారు.

కారు ఢీకొని యాచకుడి మృతి

కావలి రూరల్, ఆగస్టు 22: స్థానిక రామ్మూర్తిపేటలోని సాయిబాబా ఆలయం వద్ద గురువారం గుర్తు తెలియని కారు ఢీకొని యాచకుడు (50) మృతి చెందాడు. ఒకటో పట్టణ పోలీసుల కథనం మేరకు, సాయిబాబా ఆలయం వద్ద భిక్షాటనకు యాచకుడు రాగా, తుమ్మలపెంట రోడ్డు నుంచి ఆలయం వైపునకు వచ్చిన గుర్తు తెలియని కారు ఢీకొని వెళ్లిపోయింది. దీంతో తీవ్రంగా గాయపడిన యాచ కుడు అక్కడికక్కడే మృతి చెందాడు. ఆలయ కార్యాలయ ఇన్‌చార్జి క్రిష్ణారావు ఫిర్యాదు మేరకు మృతదేహాన్ని పరిశీలించగా, ఎలాంటి ఆధారాలు లభించలేదు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఏరియా వైద్యశాలకు తరలించి ఎస్ఐ అంబేడ్కర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో దంపతులకు గాయాలు

- బాధితులు ప్రొద్దుటూరు వాసులు



ప్రమాదానికి గురైన కారు

జలదంకి, ఆగస్టు22: మండలంలోని 9వమైలు చీకటివాగు వంతెన సమీపంలో హైవేపై గురువారం తెల్లవారుజామున కారు బోల్తా పడగా, అందులో ప్రయాణిస్తున్న కడపజిల్లా ప్రొద్దుటూరుకు చెందిన భార్యాభర్తలు టీ సుధాకర్, టీవిజయలక్ష్మిలకు గాయాలయ్యాయి. 9వమైలు గ్రామంలో బుధవారం రాత్రి జరిగిన ఓ వివాహానికి వీరు హాజరయ్యారు. తెల్లవారుజామున టీ తాగేందుకు కారులో జలదంకి వెళ్లి తిరిగి వస్తున్న క్రమంలో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు కారులో ఉన్న వారిని బయటకు తీసి చికిత్స నిమిత్తం కావలి ఏరియా వైద్యశాలకు తరలించారు. విషయం తెలుసుకున్న బంధువులు వారిని పరామర్శించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	114
లేయర్ లైవ్	105
స్కిన్ చికెన్	210
స్కిన్‌లెస్	230
లేయర్	178

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.6883
వెండి కిలో ధర	రూ. 87,100
వెండి ఒక గ్రాము	రూ. 90.10

సోమశిలలో 27.253 టీఎంసీల నీరు నిల్వ

అనంతసాగరం, ఆగస్టు 22: సోమశిల జలాశయానికి ఎగువ నుంచి గురువారం 11,505 క్యూసెక్కుల ప్రవాహం వస్తున్నట్లు అధికారులు తెలిపారు. పూర్తిస్థాయి నీటి సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా ప్రస్తుతం 27.253 టీఎంసీల నిల్వ ఉంది. దిగువ కండలేరుకు 2000, డెల్టా, ఉత్తర, దక్షిణ కాలువలకు 210 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు.



ప్రతిపాదనలతో సరి..

పనులేవి మరి !

- పూడికతో నిండిన పంట కాలువలు
- నెలక్రితమే రూ.40 కోట్లతో ప్రతిపాదనలు
- ఓఅండ్ఎం వర్కులకు రాని అనుమతులు
- ముంచుకొస్తున్న సీజన్‌తో అన్నదాత దిగాలు

నెల్లూరు, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): సాగునీటి పారుదలలో కీలకమైన పంట కాలువలు పూడికతో నిండిపోయాయి. నెలక్రితమే ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ (ఓఅండ్ఎం) కింద పూడికతీత కోసం జిల్లా యంత్రాంగం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపింది. అయితే కాలం గడుస్తున్నా ఇప్పటికీ అనుమతులు రాకపోవడంతో అన్నదాతలో దిగులు పట్టుకుంది. వైసీపీ ప్రభుత్వం పంట కాలువలను పట్టించుకోకపోవడంతో పూడిక, గుర్రపుడెక్కతో నిండిపోయాయి. దీంతో స్థాయికి తగ్గట్టుగా కాలువల్లో నీటి పారుదల జరగడం లేదు. ఇది ఆయకట్టు రైతులకు తీవ్ర ఇబ్బందిగా మారింది. ఈ క్రమంలోనే కొత్తగా ప్రభుత్వం ఏర్పడగానే జిల్లాలోని ఎమ్మెల్యేలంతా సాగునీటి రంగంపై దృష్టిపెట్టారు. వ్యవసాయ సీజన్ సమీపిస్తున్న తరుణంలో కాలువలను బాగు చేయాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. అదే సమయంలో జిల్లాకు వచ్చిన జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు దృష్టికి కూడా తీసుకెళ్లారు.

రూ.110 కోట్లతో ప్రతిపాదనలు

గతనెల ప్రారంభంలో రాష్ట్ర జలవనరుల శాఖ ఉన్నతాధికారులు జిల్లా ఇంజనీర్లతో సమావేశమై ఓఅండ్ఎం పనులపై సమీక్షించారు. కాలువలను పూర్తిస్థాయిలో బాగు చేయాలంటే సుమారు రూ.110 కోట్లు అవసరమని ప్రతిపాదించారు. సాధారణంగా ఏటా ఓఅండ్ఎం పనులకు రూ.30 కోట్లలోపే సరిపోతాయి. కానీ ఇంత పెద్దమొత్తంలో ప్రతిపాదించారంటే క్షేత్రస్థాయి పరిస్థితి అర్థంచేసుకోవచ్చు. అయితే శిస్తు వసూలు జరగకుండా అంత పెద్ద మొత్తం ఓఅండ్ఎం కింద ఇవ్వడం సాధ్యపడదని నిర్ధారించిన ఉన్నతాధికారులు ఈ సీజన్‌కు రూ.40 కోట్లతో ఓఅండ్ఎం ప్రతిపాదనలు పంపాలని ఆదేశించారు. ఆ మేరకు అన్ని డివిజన్ల నుంచి ప్రభుత్వానికి ప్రతిపాదనలు అందాయి. ఇది జరిగి కూడా నెల రోజులు గడిచింది. కానీ ఇంతవరకూ ఈ ప్రతిపాదనలకు ఆమోద ముద్ర పడలేదు.

రైతాంగం ఆందోళన

వ్యవసాయ సీజన్ సమీపిస్తుండటం, ఇంకా ఓఅండ్ఎం పనులకు అనుమతులు రాకపోవడంతో రైతాంగం ఆందోళన చెందుతోంది. ప్రభుత్వం అనుమతులిచ్చాక టెండర్లు పిలిచి అగ్రిమెంట్లు చేసుకునేందుకే రెండు వారాల సమయం పడుతుంది. ఆ తర్వాత పనులు చేయడానికి మరో రెండు వారాల సమయం పడుతుందని ఇంజనీర్లు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో వెంటనే ప్రభుత్వం నుంచి పనులకు అనుమతులు రావాల్సి ఉందని అంటున్నారు. ప్రస్తుతం సోమశిలకు కృష్ణా జలాలు వచ్చి చేరుతున్నాయి. ఈ సీజన్‌లో సాగులేక దిగాలుగా ఉన్న రైతాంగంలో వచ్చే సీజన్‌లో సాగుపై ఆశలు చిగురిస్తున్నాయి. అదే సమయంలో ధాన్యం ధరలు కూడా ఆశాజనకంగా ఉన్నాయి. ఈ క్రమంలో వీలైనంత త్వరగా ఓఅండ్ఎం వర్కులకు అనుమతులు వచ్చేలా జిల్లాలోని ప్రజాప్రతినిధులు కృషి చేయాల్సిన అవసరం ఉందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

ఎస్టీ వర్గీకరణ చేపట్టాలి

నెల్లూరు (హరనాథపురం), ఆగస్టు 22 : సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం ఎస్సీ వర్గీకరణ మా దిరిగా ఎస్టీ వర్గీకరణ కూడా చేయాలని గిరిజన గెజిటెడ్, నాన్ గెజిటెడ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పులి చెంచయ్య ప్రభుత్వాన్ని కోరారు. నగరంలోని వెన్నెల కంటి రాఘవయ్య భవన్‌లో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎస్టీలలో కొన్ని తెగలకు సామాజిక న్యాయం జరగడం లేదన్నారు. కొన్ని తెగల వారు మాత్రమే రిజర్వేషన్ ఫలాలు పొందుతున్నారన్నారు. అత్యధికంగా ఉన్న యానాదులకు మాత్రం సరైన రిజర్వేషన్ ఫలాలు అందడం లేదన్నారు. ఈ క్రమంలో ఎస్టీ వర్గీకరణను వెంటనే చేపట్టాలని కోరారు. ఈ సమావేశంలో యానాది సంఘాల మహాకూటమి రాష్ట్ర అధ్యక్షుడు బాపట్ల వెంకటపతి, ట్రైబుల్ ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కొమరగిరి దయాకర్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు శాస్త్రవేత్తలుగా ఎదగాలి

- ఎస్ఎస్ఏ పీడీ కల్పనాశైల

నెల్లూరు(విద్య), ఆగస్టు 22 : విద్యార్థులు చిన్నతనం నుంచి శాస్త్ర పరిశోధనలపై ఆసక్తి పెంచుకని భావి శాస్త్రవేత్తలుగా ఎదగాలని సమగ్రశిక్ష రాష్ట్ర ప్రాజెక్ట్ డైరెక్టర్ కల్పనాశైల అన్నారు. నగరంలోని దర్గామిట్ట జడ్పీ బాలికోన్నత పాఠశాలలో గురువారం జాతీయ అంతరిక్ష దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆమె మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా వారం రోజుల పాటు నేషనల్ స్పేస్ వీక్ కార్యక్రమాన్ని నిర్వహిస్తుందన్నారు. విద్యార్థులు ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహాన్ని అందిపుచ్చుకుని తమలో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసి ఉత్తమ ప్రాజెక్టల ఆవిష్కరణలకు శ్రీకారం చుట్టాలన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థులను ప్రోత్సహించి అంతరిక్ష పరిశోధకులుగా తీర్చిదిద్దాలని తెలిపారు. అనంతరం జిల్లా సైన్స్ కేంద్రం క్యూరేటర్ ఎన్.సుబ్రహ్మణ్యం తయారు చేసిన చంద్రయాన్-3 నమూనా, 2 అడుగుల వ్యాసం కలిగిన చంద్రుడి నమూనాలను పరిశీలించారు.



సైన్స్ నమూనాను ప్రదర్శిస్తున్న అధికారులు, విద్యార్థులు

ఉపాధ్యాయులకు శిక్షణ

నగరంలోని దర్గామిట్ట జడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం అభ్యసనాభివృద్ధి కార్యక్రమంలో భాగంగా ప్రధానోపాధ్యాయులు, తెలుగు, ఇంగ్లీష్ ఉపాధ్యాయులు శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సమగ్రశిక్ష రాష్ట్ర ప్రాజెక్ట్ డైరెక్టర్ కల్పనాశైల మాట్లాడుతూ జిల్లాలో సీల్ ఎనర్జీ ఇండియా లిమిటెడ్, బాలరక్ష భారత్ కార్యక్రమం 20 పాఠశాలల్లో అమలవుతుందన్నారు. విద్యార్థులకు బేస్‌లైన్ పరీక్షలు నిర్వహించి నూతన విద్యాబోధన చేస్తారన్నారు. దీనివలన విద్యార్థులు వారి అభ్యసనా సామర్థ్యాలను మొరుగుపరుచుకునే అవకాశం కలుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో ఎస్ఎస్ఏ అకడమిక్ మానటరింగ్ అధికారి జి.సుధీర్‌బాబు, జిల్లా సైన్స్ సెంటర్ ఇన్‌చార్జి గాయత్రి, బాలరక్ష భారత్ మేనేజర్ ఎం.నాగేష్, హెచ్ఎం కృష్ణారెడ్డి, ఉపాధ్యాయుడు జిలానీబాషా, రీసోర్స్ పర్సన్ టీవీ.రమణ, రంగనాధన్, రషి, సిబ్బంది పాల్గొన్నారు.

బట్టీ యజమాని దగ్గర వివరాలు తీసుకుంటున్న జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ అధికారి



ఇటుక బట్టీలలో పిల్లలతో పనిచేయిస్తే కఠిన చర్యలు

- జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ అధికారి సురేష్

తోటపల్లిగూడూరు, ఆగస్టు 22: బడి ఈడు పిల్లలను బడికి పంపించకుండా ఇటుక బట్టీలలో పనిచేయిస్తే బట్టీ యజమానిపై చర్యలు తప్పవని చైల్డ్ ప్రొటెక్షన్ అధికారి సురేష్ హెచ్చరించారు. గురువారం మండలంలోని ఇస్కపాలెం గ్రామ పంచాయతీలో నిర్వహిస్తున్న ఇటుకల బట్టీలో చిన్నపిల్లలు బాల కార్మికులుగా పనిచేస్తున్నారన్న సమాచారం తెలుసుకున్న డిస్ట్రిక్ట్ చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ సురేష్, అడిషనల్ లేబర్ ఆఫీసర్ రామారావు రైస్‌మిల్లు సమీపంలో ఎటువంటి అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న పులివర్తి శోభనాద్రికి చెందిన ఇటుకల బట్టీని పరిశీలించి బట్టీ యజమానిని ప్రశ్నించగా.. ఇక్కడ బాలకార్మికులు ఎవరూ లేరని, బుధవారం బంద్ కారణంగా కూలిపని చేస్తున్నవారి పిల్లలు బట్టీ ప్రాంగణంలోకి వచ్చారని.. మరలా ఇలాంటి పరిస్థితి రాకుండా చూసుకుంటానని అధికారులకు తెలిపారు. అనంతరం సురేష్ మాట్లాడుతూ పిల్లలతో పనిచేయిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏహెచ్‌టీయు ఏఎస్ఐ సతీష్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సమత, మహిళా కానిస్టేబుల్ సుజాత, అంగన్‌వాడీ టీచర్లు, తదితరులు పాల్గొన్నారు.

కావలిలో అంతర్జాతీయ రెడ్‌క్రాస్ బృందం

- పలు విభాగాల సందర్శన, గిరిజన కాలనీలో పర్యటన



కావలి గిరిజన కాలనీలో పర్యటిస్తున్న అంతర్జాతీయ రెడ్‌క్రాస్ ప్రధాన కేంద్రం అధికారులు

కావలి, ఆగస్టు 22: అంతర్జాతీయ రెడ్‌క్రాస్ అధికారిణి కాతేరిన మేరీమార్టిన్ తన బృందంతో గురువారం కావలి రెడ్‌క్రాస్‌ను సందర్శించారు. ఇంటర్నేషనల్ కమిటీ ఫర్ రెడ్‌క్రాస్ భారతదేశ సహకార అధికారి జాన్‌జార్జ్, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ సమాచారాధికారిణి రాణి విభూషిత, ఏపీ రెడ్‌క్రాస్ యూత్ కోఆర్డినేటర్ తెనాలి మధుబాబు ఈ బృందంలో ఉన్నారు. వారికి స్థానిక రెడ్‌క్రాస్ ప్రతినిధులు డాక్టర్ బెజవాడ రవికుమార్, డాకారపు రవిప్రకాష్ స్వాగతం పలికారు. అనంతరం వారు రెడ్‌క్రాస్ రక్తనిధి కేంద్రం, మరణానంతర సేవలు, యోగా తదితర విభాగాలను పరిశీలించారు. కావలి యూత్ రెడ్‌క్రాస్ ప్రతినిధులు బీద లక్ష్మీనంద, సౌందర్య దీపిక, కీర్తన, సావిత్రి, శ్రావ్య, దాత్రి. తేజస్విన్‌లు తాము చేస్తున్న సేవా కార్యక్రమాలపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా త్వరలో ప్రారంభం కానున్న తలసేమియా కేంద్రం ప్రదాన దాత రమేష్‌రెడ్డి, సంచారజాతుల ప్రజలకు సేవలందిస్తున్న మాజీ కౌన్సిలర్ నందనవనం సీతాలక్ష్మి, రెడ్‌క్రాస్ కోశాధికారి కలికి శ్రీహరిరెడ్డిలను సత్కరించారు.

సేవా కార్యక్రమాల పరిశీలన

స్థానిక శివరామసుబ్బయ్య గిరిజన కాలనీలో యూత్ రెడ్‌క్రాస్ బాధ్యులు పీవీ సాయి తేజ, పీ. సాయికుమార్, బెజవాడ ప్రసన్నకుమార్ నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలను అంతర్జాతీయ రెడ్‌క్రాస్ ప్రతినిధులు పరిశీలించారు. అనంతరం గిరిజనకాలనీకి చెందిన నలుగురు విద్యార్థులకు సైకిళ్లను బహూకరించారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ ప్రతినిధులు దామిశెట్టి సుధీర్‌నాయుడు, పార్వతీ శంకర్, రాజశేఖర్, హరి నారపరెడ్డి, ప్రసన్నాంజనేయులు, మధుసూదనరెడ్డి, ప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పోస్టల్ శాఖలో ఫిలాటలీ స్కాలర్‌షిప్

నెల్లూరు(విద్య), ఆగస్టు 22 : పోస్టల్ శాఖ నిర్వహించే ఫిలాటలీ స్టాంప్ కలెక్షన్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించే విధానంలో భాగంగా దీన్‌దయాళ్ స్పర్శ్ యోజనా-2024 ఫిలాటలీ స్కాలర్‌షిప్ పథకాన్ని అమలు చేస్తున్నట్లు నెల్లూరు పోస్టల్ సూపరింటెం డెంట్ కె.శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పథకం ద్వారా 6 నుంచి 9వ తరగతి విద్యార్థులకు పోటీ పరీక్షలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. 2023-24 విద్యాసంవ త్సరంలో విద్యార్థులు 60శాతం మార్కులు సాధించి ఉండాలని, ఎస్సీ ఎస్టీ విద్యార్థులకు 5శాతం రాయితీ ఉంటుందని పేర్కొన్నారు. ప్రతి తరగతి నుంచి 10 మంది విద్యార్థులను ఎంపిక చేసి ఒక్కొక్కరికి ఏడాదికి రూ.6వేలు చొప్పున ఫిలాటలీ స్కాలర్‌షిప్ అందిస్తామని పేర్కొన్నారు. విద్యార్థుల ఎంపిక రెండు విభాగాలుగా ఉంటుందని పేర్కొన్నారు. పాఠ శాలలో దరఖాస్తు చేసుకునే విద్యార్థుల పేర్ల ను నమోదు చేయాలని తెలిపారు. అనంతరం పోస్ట్‌మాస్టర్ జనరల్, విజయవాడ-520003 వారికి ఫిలాటలీ పోస్టల్ స్టాంప్ అతి కించి సెప్టెంబరు 16వ తేదీ లోపు పంపిచా లని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు సమీపంలోని పోస్టాఫీస్‌లో సంప్రదించాలని తెలిపారు.

కామాక్షితాయి నిత్యాన్నదానానికి రూ.1,00,116 విరాళం



నిత్యాన్నదాన పథకానికి విరాళాన్ని ఆలయ ఉద్యోగులకు అందజేస్తున్న దాతలు

బుచ్చిరెడ్డిపాళెం, ఆగస్టు 22: మండలంలోని జొన్నవాడ మల్లికార్జునస్వామి, కామాక్షితాయి ఆలయ నిత్యాన్నదాన పథకానికి ఇనమడుగు గ్రామానికి చెందిన కైలాసం వసంత్‌కుమార్‌రెడ్డి, సుభాషిణి దంపతులు ఆలయ అధికారులకు గురువారం రూ. 1,00,116 విరాళాన్ని ఆలయ ఉద్యోగులు నరసింహ, సుమన్‌లకు అందజేశారు. ఈమేరకు విరాళం బాండును దాతలకు అందజేశారు. ఈసందర్భంగా అర్చకులు స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి దాతలకు తీర్థప్రసాదాలు అందజేశారు.


10 నుంచి ఏపీ ట్రాన్స్‌కో వాలీబాల్ పోటీలు

నెల్లూరు(జడ్పీ), ఆగస్టు 22: ఏపీ ట్రాన్స్‌కో ఇంటర్ సర్కిల్ వాలీబాల్ పోటీలు వచ్చేనెల 10 నుంచి 12 వరకు రాజమహేంద్రవరంలో నిర్వహించనున్నట్లు క్రీడా విభాగం కార్యదర్శి ఆర్ వేలు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏపీఎస్పీడీసీఎల్ నెల్లూరు సర్కిల్‌లో పని చేస్తున్న విద్యుత్ కార్మికులు, జూనియర్ లైన్‌మ్యాన్లు, గ్రేడ్ 2 కార్మికుల్లో ఆసక్తి ఉన్న వారు శుక్రవారం సాయంత్రం 4 గంటల లోపు నెల్లూరు నగరంలోని విద్యుత్ భవన్‌లో జరిగే ఎంపికకు హాజరుకావాలని తెలిపారు.

‘ఫోర్జరీ’ పేరుతో అక్రమాలు పక్కదారి

- పోలీసులకు కార్పొరేషన్‌లో ఫైళ్లు దొరకలేదట !
- బిల్డర్లపై కేసులు ఎందుకు పెట్టలేదు ?
- కార్పొరేషన్‌లో అగ్నిప్రమాదం జరుగుతుందేమో...
- టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆనం

నెల్లూరు, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్‌లో కమిషనర్ల సంతకాలు ఫోర్జరీ పేరుతో డ్రామాలు ఆడుతూ, అసలు దోపిడీని పక్కదారి పట్టిస్తున్నారని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆనం వెంకటరమణారెడ్డి ఆరోపించారు. గురువారం నెల్లూరులోని ఎన్టీఆర్ భవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. కమిషనర్ల సంతకాలు ఫోర్జరీ చేసి నాలుగు భవనాల మార్టిగేజ్‌లు రిలీజ్ చేశారని, అందుకు మేయర్ భర్త కారణమని చెప్పి అసలు విషయాన్ని పక్కదారి పట్టించే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆయన చెప్పారు. ఈ కుంభకోణానికి సూత్రధారులైన గత కమిషనర్లపై వెంటనే కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఐఏఎస్ అధికారులైతే ఏమైనా చేయవచ్చా..? వారికి నిబంధనలు వర్తించవా..? డబ్బులు ఇస్తే ఏమైనా చేసే స్థాయికి దిగజారుతారా..? అంటూ ఆనం తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. వ్యక్తులు కూడా మార్టిగేజ్‌లు రిలీజ్ చేశారని చెప్పారు. దారినపోయే వ్యక్తులు ఇలా చేయడం తీవ్ర నేరమని అన్నారు. నెల్లూరు కార్పొరేషన్‌లో కూడా ఫైల్స్ కాలిపోతాయనే అనుమానం కలుగుతోందని వెంకటరమణారెడ్డి వ్యాఖ్యానించారు. వెంటనే కలెక్టర్ స్పందించి అగ్నిప్రమాదం జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. వైసీపీ ప్రభుత్వంలో ఆ పార్టీ నాయ కులు, అధికారులు మున్సి పాలిటీలను ఆదాయ వనరులుగా మార్చుకున్నారని ఆనం ధ్వజమె త్తారు. మార్టిగేజ్ రిలీజ్ వ్యవహారం రాష్ట్ర వ్యాప్తంగా అన్ని కార్పొరేషన్‌లలో జరిగిందని ఆరోపించారు. మంత్రి నారాయణ వీటిపై దృష్టి పెట్టి అక్రమాలను వెలికి తీయడంతో పాటు ఇందుకు బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని ఆనం డిమాండ్ చేశారు.



నెల్లూరులో విలేకరులతో మాట్లాడుతున్న ఆనం వెంకటరమణారెడ్డి

గోదాములో ఎంపీడీవో కార్యాలయం

- ఏడాది కిందట శిథిలావస్థకు చేరిన భవనం
- అప్పటి నుంచి అక్కడే ఉద్యోగుల విధుల నిర్వహణ
- పట్టించుకోని గత ప్రభుత్వం



వ్యవసాయ శాఖ గోదాము

ఉదయగిరి రూరల్, ఆగస్టు 22: పంచాయతీల అభివృద్ధి, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంలో ప్రధానపాత్ర పోషించేది మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయం. ఇంతటి ప్రాధాన్యం ఉన్న కార్యాలయానికి ఉన్న సొంత భవనం శిథిలావస్థకు చేరి కూలేదశలో ఉంది. దీంతో గతేడాది అధికా రులు సమీపంలోని వ్యవసాయశాఖకు చెందిన గోదాంలో కార్యాలయంను మార్చారు. ఇందులో ఒకే గది ఉండటంతో సిబ్బంది అంతా ఓ చోట కూర్చొని విధులు నిర్వహిస్తున్నారు. మరోవైపు బాత్‌రూం సైతం లేక పోవడంతో కార్యాలయంలో మహిళా ఉద్యోగులు, వివిధ పనులపై వచ్చే ప్రజలు ఇబ్బందులు పడు తున్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో భవన దుస్థితిని వివరిస్తూ నూతన భవనం నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని అధికారులు ఉన్నతాధికా రులకు ప్రతిపాదనలు పంపారు. ఇప్పటివరకు ఎ లాంటి అనుమతులు రాలేదు.

1965లో నిర్మించిన మండల సమితి కార్యాలయ భవనంలోనే..

ఆ భవనంలోనే ఎంపీడీవో కార్యాలయం నిర్వహించేవారు. గత ఏడాది పూర్తిస్థాయిలో శిథిలావస్థకు చేరి, చెట్ల వేర్లు స్లాబు గదుల్లోకి చొచ్చుకొచ్చాయి. ఈ సమస్యతో స్లాబు మొత్తం దెబ్బతిని పెచ్చులూడుతుంది. చిన్నపాటి వర్షానికి కార్యాలయంలో అన్నిగదులు ఉరుస్తుండడంతో అటు సిబ్బంది, ఇటు ప్రజలకు తీవ్ర ఇబ్బందులు కలిగాయి.



శిథిలావస్థకు చేరిన ఎంపీడీవో కార్యాలయ భవనం

2017లో కార్యాలయ సమావేశ మందిరం కుప్పకూలింది. నాటినుంచి దాని నిర్మాణం గురించి పట్టించుకోక పోవడంతో అవస్థలు పడుతున్నారు. స్లాబు పెచ్చులూడి ఉద్యోగులు, సిబ్బంది పైనపడి గాయాలైన సంఘటనలు ఉన్నాయి. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం స్పందించి నూతన భవనాల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని ఉద్యోగులు, మండల ప్రజలు కోరుతున్నారు.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం

ఎంపీడీవో కార్యాలయ భవనం పూర్తి శిథిలావస్థకు చేరి కూలే దశలో ఉండడంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కార్యాలయాన్ని వ్యవసాయశాఖ గోదాంలో నిర్వహిస్తున్నాం. అక్కడ సరైన వసతులు లేక ఇబ్బందులు పడుతున్నాం. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం.

-డీ ఈశ్వరమ్మ, ఎంపీడీవో, ఉదయగిరి

ఎంపీడీవో బాధ్యతల స్వీకరణ

ఏఎస్ పేట, ఆగస్టు 22: మండల ఎంపీడీఓ శ్రీనివాసులు గురువారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇన్‌చార్జిగా పని చేసిన ఆయన ఎంపీడీఓగా పూర్తి బాధ్యతలు తీసుకున్నారు. ఈ సందర్భంగా కార్యాలయ సి బ్బంది, ఎన్‌ఆర్‌ఈజీఎస్ సిబ్బంది సన్మానించారు.

వరికుంటపాడు: మండల అభివృద్ధి అధికారి మల్లికార్జున బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఉన్న ఎంపీడీవో వెంకటకృష్ణకుమారి ఎన్నికల అనంతరం జరిగిన బదిలీల్లో ప్రకాశం జిల్లా యద్దనపూడికి వెళ్లారు.

సీఐకి ఘన సన్మానం



సీఐని సన్మానించి చిత్రపటాన్ని అందజేస్తున్న టీడీపీ నాయకులు

ఉదయగిరి రూరల్, ఆగస్టు 22: ఉదయగిరి సీఐ వేల్పుల గిరిబాబును స్థానిక సర్కిల్ కార్యాలయంలో గురువారం దుత్తలూరు మండల టీడీపీ నాయకులు ఘనంగా సన్మానించి చిత్రపటాన్ని బహూకరించారు. విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనపరిచి స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా మంత్రి పొంగూరు నారాయణ, జిల్లా ఎస్పీ కృష్ణకాంత్ చేతుల మీదుగా పోలీసు సేవా పతకం పొందం అభినందనీయం అన్నారు. కార్యక్రమంలో టీడీపీ నియోజకర్గ అధికార ప్రతినిధి చల్లా ప్రసాద్, మాజీ జడ్పీటీసీ సభ్యులు చీదర్ల మల్లికార్జున, మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు యనమల రత్తయ్య పాల్గొన్నారు.

రేపు దేపూరులో వెంకయ్యస్వామి ఆరాధనోత్సవాలు

ఆత్మకూరు, ఆగస్టు 22 : దేపూరు భగవాన్ వెంకయ్యస్వామి ఆరోధనోత్సవాలు శనివారం నిర్వహించనున్నట్లు ఆశ్రమ కమిటీ సభ్యులు ఓ ప్రకటనలో నిర్వాహకులు తెలిపారు. ఉదయం 4గంటలకు నుంచే ప్రత్యేక పూజలతో పాటు రాత్రికి భక్తుల సౌకర్యార్థం సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశామన్నారు. ఆదివారం తెల్లవారుజామున స్వామి గ్రామోత్సవం నిర్వహిస్తామన్నారు.

పాఠశాలకు బీరువా వితరణ

ఉదయగిరి రూరల్, ఆగస్టు 22: గండిపాళెం ప్రాథమిక పాఠశాలకు రెడ్డిబత్తిన పరాంధమయ్య జ్ఞాపకార్థం గురువారం ఆయన కుమారులు, కుమార్తె పెదనారాయణ, జయనారాయణ, నారాయణమ్మలు రూ.8వేల విలువైన బీరువా వితరణగా అందజేశారు. అలాగే శుభ్‌దిన్ భోజన్ కార్యక్రమంలో భాగంగా జిల్లా పరిషత్ ఉన్నత, ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు ప్రత్యేక భోజనం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఐటీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి రెడ్డిబత్తిన ఉమాసాయిరాం, మాజీ ఎంపీటీసీ అడుసుమల్లి వెంకటేశ్వర్లు, మాజీ ఉప సర్పంచ్ రెడ్డిబత్తిన నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

అతిథి ఉపాధ్యాయ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

ఉదయగిరి రూరల్, ఆగస్టు 22: గండిపాళెం గురుకుల పాఠశాలలో ఖాళీగా ఉన్న అతిథి ఉపాధ్యాయ పోస్టులకు అర్హులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ పుష్పరాజ్ గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. తెలుగు పీజీటీ, గణితం పీజీటీ, స్టాఫ్‌నర్సు పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. 2018డీఎస్సీ నియమ, నిబంధనల ప్రకారం ఈ నెల 27వ తేదీలోపు తమ వివరాలతో కూడిన దరఖాస్తులను పాఠశాలలో అందజేయాలన్నారు. జిల్లా ఉప విద్యాశాఖాధికారి ఆధ్వర్యంలో డెమో తరగతుల ఆధారంగా తీసుకొని అర్హులను ఎంపిక చేస్తామన్నారు.

ఉపాధ్యాయుడికి అభినందన

అనంతసాగరం, ఆగస్టు 22: చిలకలమర్రి ఉన్నత పాఠశాల గణిత ఉపాధ్యాయుడు చల్లా చంద్రశేఖర్‌రెడ్డికి ఇస్రో ఛైర్మన్ డాక్టర్ ఎస్.సోమనాథ్ నుంచి గురువారం అభినందన ప్రశంసాపత్రం అందింది. జాతీయ అంతరిక్ష దినోత్సవం సందర్భంగా ఇస్రో, మై గావ్ సంయుక్తతంగా నిర్వహించిన జాతీయ క్విజ్ పోటీల్లో పాల్గొన్నందుకు ఈ లేఖ అందినట్లు ఉపాధ్యాయుడు తెలిపారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్‌రెడ్డిని తోటి ఉపాధ్యాయులు, మిత్రులు అభినందనలు తెలిపారు.

గాలికుంటు నివారణ టీకాలు

వింజమూరు, ఆగస్టు 22 : చాకలకొండ ఎస్సీ కాలనీలో గురువారం పశువైద్యాధికారి కొమ్మి కోటేశ్వరరావు ఆధ్వర్యంలో సిబ్బంది గురువారం పశువులకు గాలికుంటు నివారణ టీకాలు, పెయ్యదూడలకు టీకాలు వేశారు. అలాగే బీసీ కాలనీలో డాక్టర్ హరినాథ్ ఆదేశాల మేరకు సచివా లయ వెటర్నరీ అసిస్టెంట్ వీరశేఖర్ పశువులకు పెయ్య దూడలకు టీకాలు వేశారు. కార్యక్రమంలో పశు వైద్య సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

గ్రామసభలను సద్వినియోగం చేసుకోండి

ఉదయగిరి రూరల్, ఆగస్టు 22: స్థానిక పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించే ప్రత్యేక గ్రామసభను పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పంచాయతీ కార్యదర్శి షేక్ కరీముల్లా గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సభలో ఉపాధి పనుల ప్రాముఖ్యతతో పాటు నూతన పనులు గుర్తించి ప్రతిపాదనలు పంపుతామన్నారు.

చేజర్ల: అభివృద్ధి పనులను గుర్తించేందుకు అన్ని గ్రామాల్లో నేడు గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ విజయలలిత తెలిపారు. కొత్తగా చేపట్టాల్సిన పనులను గుర్తించేందుకు ప్రత్యేక అధికారులను నియమించినట్లు తెలిపారు.

సంగం: అన్ని పంచాయతీల్లో ఆయా గ్రామ సర్పంచ్‌ల ఆధ్వర్యంలో శుక్రవారం గ్రామసభలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో గోపీ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం పది పంచాయతీల్లో, మధ్యాహ్నం మిగిలిన పది పంచాయతీల్లో ఈ సభలు జరుగుతాయని తెలిపారు. ప్రతి పంచాయతీకి మండలస్థాయి అధికారి ఒకరని నియమించామన్నారు. ఉపాధి కూలీలు, గ్రామస్థులు హాజరై ఈ సభలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వరికుంటపాడు: మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో ఉపాధిహామీ పథకం పనుల గుర్తింపునకు శుక్రవారం నిర్వహించే ప్రత్యేక గ్రామసభలకు నోడల్ అధికారులను నియమించినట్లు ఎంపీడీవో మల్లికార్జున తెలిపారు. నోడల్ అధికారులుగా డీటీ చెంచయ్య, మండల పరిషత్ కార్యాలయ ఏవో వేణుగోపాల్‌రావు, ఎంఈవోలు షావుద్దీన్, రమణయ్య, పీఆర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈలు నందకిషోర్, హనినిస్సి, ఏపీవో అజమ్‌ఖాన్, ఆర్ఐ సాయికిరణ్, ఏవో రవికుమార్, ఈసీ వెంకటేశ్వర్లు, ఏపీఎం ఫైనారూత్, సీసీలు ప్రమీల, ప్రభావతి ఉన్నట్లు చెప్పారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది తప్పక హాజరై విజయవంతం చేయాలని కోరారు.

సొసైటీ సీఈవోల ధర్నా



వింజమూరు సొసైటీ ఎదుట నిరసన తెలుపుతున్న సీఈవోలు

వింజమూరు, ఆగస్టు 22: పట్టణంలోని కో ఆపరేటివ్ సొసైటీ బ్యాంక్ ఎదుట గురువారం వింజమూరు కుడుములు దిన్నెపాడు, కలిగిరి, సిద్ధనకొండూరు గరిమలపంట సీఈవోలు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టిన కంప్యూటరీకరణకు గడువు ఇవ్వాలని, సిబ్బంది కొరతను తీర్చాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ విషయంపై శుక్రవారం విజయవాడలో పెన్‌డౌన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఐదు మండలాల సీఈవోలు, సొసైటీ సిబ్బంది పాల్గొన్నారు.

ఏఎస్ పేటలో ఉపాధి కూలీ మృతి

ఏఎస్ పేట, ఆగస్టు 22: మండలకేంద్రానికి చెందిన ఖా జా మస్తాన్ (55) గురువారం ఉదయం ఉపాధిహామీ పను లకు వెళ్లాడు. అక్కడ పని చేస్తూ కుప్పకూలిపోయాడు. గమనించిన తోటి కూలీలు 108కి సమాచారం అందజేశారు. వాహ నం వచ్చి తరలించేలోపు ఆయన మృతి చెందాడు. గత కొన్ని సంవత్సరాలుగా అందరితో కలసి ఉత్సహంగా ఉపాధిహామీ పనులు చేస్తున్న వ్యక్తి హఠాత్తుగా మృతి చెందడంతో కూలీలు కన్నీటి పర్యంతమయ్యారు. విషయం తెలుసుకున్న ఈసీ నవీ న్, ఏపీఓలు పని ప్రదేశానికి వెళ్లి మృతదేహన్ని పరిశీలించారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు.

కోల్‌కతా నిందితులను కఠినంగా శిక్షించాలి



ఆత్మకూరు: నిరసన వ్యక్తం చేస్తున్న ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థినులు

ఆత్మకూరు, ఆగస్టు 22: కోల్‌కతాలోని ఆర్‌జీకేఆర్ మెడికల్ కాలేజీలో విధులు నిర్వహిస్తున్న జూనియర్ డాక్టర్‌ను హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని ఏపీఎస్ ఆధ్వర్యంలో నాయకులు డిమాండ్ చేశారు. గురువారం ఆత్మకూరు ఇంజనీరింగ్ కళాశాలలో విద్యార్థినులతో కలిసి కొవ్వత్తులు వెలిగించి నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కిషోర్‌రెడ్డి, ఆంధ్ర విద్యార్థి సంఘం నియోజకవర్గ కన్వీనర్ మాహంత్‌రెడ్డి పాల్గొన్నారు.

అనంతసాగరం: కోల్‌కత్తా జూనియర్ డాక్టర్ అత్యాచారం, హత్యా ఉదంతంపై సీఐటీయూ నాయకులు గురువారం సాయంత్రం స్థానిక బస్టాండ్ సెంటర్‌లో నిరసన చేపట్టారు. వైద్యురాలి హత్యకు కారణమైన నిందితులను శిక్షించాలని డి మాండ్ చేశారు. కార్య క్ర మంలో నాయకులు అన్వర్ బా షా, మీరామొహిద్దీన్, అంగన్‌వాడీ కార్యకర్తలు, వీఏవోలు తదితరులు పాల్గొన్నారు.



అనంతసాగరం: ఆందోళనలో నాయకులు

పొగాకు ధరలు ఆశాజనకం

మర్రిపాడు, ఆగస్టు 22: డీసీపల్లి పొగాకు బోర్డులో ధరలు ఆశాజనకంగా ఉన్నాయి. గురువారం బోర్డుకు రైతులు 790బేళ్లను తీసుకొని రాగా, 15కంపెనీల ప్రతినిధులు వేలంలో పాల్గొని 693బేళ్లను కొనుగోలు చేశారు. వివిధ కారణాలతో 97బేళ్లను తిరస్కరించారు. కిలో గరిష్ఠ ధర రూ.358కాగా కనిష్ఠ ధర రూ.204నమోదైనట్లు వేలం నిర్వహణాధికారి రాజశేఖర్ తెలిపారు.

బీటీఏ సభ్యత్వ నమోదు

దుత్తలూరు(ఉదయగిరి రూరల్), ఆగస్టు 22: దుత్తలూరు, నర్రవాడ, నందిపాడు, ఏరుకొల్లు పాఠశాలల్లో బీటీఏ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని గురువారం సంఘం రాష్ట్ర, జిల్లా నాయకులు నిర్వహించారు. కార్యక్రమంలో బీటీఏ రాష్ట్ర ఉపాధ్యక్షుడు లక్ష్మయ్య, జిల్లా అధ్యక్ష, ఉపాధ్యక్షులు మణి, సుబ్బు, రాజశేఖర్, కృష్ణప్రసాద్ ఉన్నారు.

విద్యార్థుల ఔదార్యం

చేజర్ల: అనారోగ్యంతో ఆస్పత్రిలో చేరిన లుంబినీ విద్యాలయ వాచ్‌మెన్ నర సింహులు పాఠశాల విద్యార్థులు రూ.40వేలు ఇచ్చారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ రమేష్, బాధిత కుటుంబసభ్యులు ఉన్నారు.

వేధింపుల కేసు నమోదు

సంగం, ఆగస్టు 22: స్థానిక పోలీస్‌స్టేషన్‌లో గురువారం వేధింపుల కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నాగార్జునరెడ్డి తెలిపారు. కొరిమెర్లకు చెందిన సుప్రజకు బుచ్చిరెడ్డిపాళెం కాకు అజయ్‌తో నాలుగేళ్ల కిందట వివాహం జరిగింది. వీరికి ఇద్దరు సంతానం. ఈ క్రమంలో అజయ్ మరో మహిళతో అక్రమ సంబంధం పెట్టుకుని భార్యను వేధిస్తుండటంతో అతని భార్య సుప్రజ ఏడాది కిందట పుట్టింటికి వెళ్లింది. ఈ నేపథ్యంలో బాధితురాలి ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ చెప్పారు.

చిల్లచెట్లతో రాకపోకలకు ఇబ్బందులు

వలేటివారిపాలెం, ఆగస్టు 22: మండలంలోని అయ్యవారిపల్లె నుంచి రామలింగాపురం వెళ్లే రోడ్డుకు ఇరువైపులా చిల్లచెట్లు కమ్మేశాయి. దీంతో ఎదురుగా వస్తున్న వాహనాలు కనిపించక వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఎదురెదురుగా వచ్చే వాహనాలు పక్కకు తొలగే అవకాశం లేనంతంగా చిల్లచెట్లు పెరిగాయి. ట్రాక్టర్‌లో వెళ్లే ప్రయాణికులను చిల్ల చెట్లు తగిలి గాయాలవుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి చిల్ల చెట్లను తొలగించాలని మండల ప్రజలు కోరుతున్నారు.



అయ్యవారిపల్లె - రామలింగాపురం రోడ్డును కమ్మేసిన చిల్లచెట్లు

ఆగిన అభివృద్ధిని పునఃప్రారంభిస్తాం : ఎంపీ వేమిరెడ్డి

కొండాపురం, ఆగస్టు22: గత ప్రభుత్వం ఎలాంటి అభివృద్ధి చేయలేదని, కూటమి ప్రభుత్వం అభివృద్ధి పనులను పునఃప్రారంభిస్తుందని నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. మండలంలోని సాయిపేటలో గురువారం అభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ జరిగింది. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. గత ప్రభుత్వం అభివృద్ధిపై ఎలాంటి దృష్టి పెట్టకపోగా జరుగుతున్న పనులను నిలుపుదల చేసిందన్నారు. పంచాయతీలో మినరల్ వాటర్ ప్లాంటు ఏర్పాటుచేయాలని, గ్రామ టీడీపీ సీనియర్ నాయకుడు గంటా లక్ష్మీనరసింహులు కోరగా, రెండు ప్లాంట్లు ఇస్తానని వీపీఆర్ హామీ ఇచ్చారు. అంతకుముందు ఆయన ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో చెంచలబాబు యాదవ్, కాకర్ల వెంకట్, టీడీపీ నాయకులు కుంకు మోహనరావు, దామా మహేశ్వరరావు, వల్లూరు వెంకటేశ్వర్లు, దామా శివబాబు, ఓరుగంటి సుమన్, ఇర్ల మహేష్ తదితరులు పాల్గొన్నారు.

- ఘనంగా ఆంజనేయుడి విగ్రహ ప్రతిష్ఠ

సాయిపేటలో నూతనంగా నిర్మించిన అభయాంజనేయుడి ఆలయంలో గురువారం విగ్రహ ప్రతిష్ఠ ఘనంగా ముగిసింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని పండితులు సాదరంగా ఆహ్వానించారు. విగ్రహాల వద్ద ప్రత్యేక పూజలుచేసి ఎంపీ వేమిరెడ్డికి, భక్తులకు అర్చకులు తీర్థప్రసాదాలు అందచేశారు. విదేశాలకు వెళ్లడంతో ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ హాజరుకాలేదు.



కొండాపురం : అభయాంజనేయ విగ్రహ ప్రతిష్ఠలో ఎంపీ వేమిరెడ్డి తదితరులు

వైభవంగా అభయాంజనేయుడి విగ్రహ ప్రతిష్ఠ

బిట్రగుంట, ఆగస్టు 22: బోగోలు మండలం సుందరగిరివారికండ్రికలో గురువారం అభయ అంజనేయుడి విగ్రహం, శ్రీవారి శంఖు,చక్ర, నామాల ప్రతిష్ఠ వైభవంగా జరిగింది. గ్రామపెద్దల ఆధ్వర్యంలో తిరుపతి జిల్లా చిల్లకూరుకు చెందిన ఈపూరు గోవిందరాజుఆచారి బృందం నాలుగురోజుల పాటు ప్రత్యేక పూజాభిషేకాలు, హోమాలు నిర్వహించారు. ఉదయం యంత్రస్థాపన, విగ్రహప్రతిష్ఠ, కుంభాభిషేకాల అనంతరం 21 అడుగుల అభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ జరిగింది. భారీగా భక్తులు తరలివచ్చారు. మధ్యాహ్నం అన్న సంతర్పణ, ప్రసాద వితరణ చేశారు.



బిట్రగుంట : అభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠలో పాల్గొన్న భక్తులు



అల్లూరు : ఆలయం వద్ద కళా ప్రదర్శనను తిలకిస్తున్న ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి

కందుకూరు : మున్సిపాలిటీ పరిధిలోని ఆనందపురంలో గురువారం అభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ వైభవంగా జరిగింది. వివిధ గ్రామాల ప్రజలు, బంధువుల కోలాహలం మధ్య ఆంజనేయస్వామి విగ్రహానికి ప్రాణప్రతిష్ఠ చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. దామచర్ల చంద్రమౌళి, ఆయన కుమారులు సుమన్, సతీష్‌ల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే డాక్టరు దివి శివరాం, ఇతర నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అల్లూరులో పోలేరమ్మ విగ్రహ ప్రతిష్ఠ

అల్లూరు : మండలంలోని పడమర గోగులపల్లిలో గురువారం పోలేరమ్మ విగ్రహ ప్రతిష్ఠను నిర్వహించారు. ఉదయం ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన, విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాలను వైభవోపేతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ వేమిరెడ్డి సోదరుడు వేమిరెడ్డి కోటారెడ్డి, మాజీ ఎమ్మెల్యే కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. కావలి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి రాత్రి ఆలయానికి చేరుకొని అమ్మవారికి ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచి ఆట తిరుమల, ఆట మధు, నాయకులు బండి అమర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఐదు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

జిల్లాలోని లింగసముద్రం, జలదంకి మండలాల్లో బుధ, గురువారాల్లో అక్రమంగా ఇసుక తరలిస్తున్న ఐదు ట్రాక్టర్లను స్వాధీనం పోలీసులు స్వాధీనం చేసుకుని, స్టేషన్‌కు తరలించారు. ఆ వివరాలు..

లింగసముద్రం : మండలంలోని వీఆర్ కోట గ్రామ సమీపంలోని మన్నేరు వాగు నుంచి ఇసుకను అక్రమ రవాణా చేస్తున్న రెండు ట్రాక్టర్లను పోలీసులు పట్టుకున్నారు.ముందుగా అందిన సమాచారం మేరకు గురువారం తెల్లవారుజామున మూడు గంటల సమయంలో మన్నేరులో ఇసుకను అక్రమంగా నింపుకొని వెళుతున్న రెండు ట్రాక్టర్లను గ్రామ శివారులో ఎస్సై ఎం బాజీబాబు, సిబ్బంది పట్టుకొని, డ్రైవర్లను, ట్రాక్టర్లను స్టేషన్‌కు తరలించారు.ఈ సంఘటనలో డ్రైవర్లపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై చెప్పారు.

జలదంకి : మండలంలోని జమ్మలపాలెం వద్ద ఎన్‌హెచ్ బిజి167 రహదారిపై ఎలాంటి అనుమతి పత్రాలు లేకుండా ఇసుక లోడుతో వెళ్తున్న మూడు ట్రాక్టర్లను బుధవారం అర్ధరాత్రి కలిగిరి సీఐ వెంకటనారాయణ సీజ్‌చేశారు. లింగసముద్రం మండలం పెద్దపవని వద్ద నుంచి ఇసుకను జమ్మలపాలెం తరలిస్తుండగా పట్టుకున్నారు. గురువారం ఈ ట్రాక్టర్లకు జరిమానా విధించి విడుదల చేశారు.

నేడు వీవీ పాలెం మండల సమావేశం

వలేటివారిపాలెం, ఆగస్టు 22 : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం మధ్యాహ్నం 2 గంటలకు ఎంపీపీ పొనుగోటి మౌనిక అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎపీడీవో శేషుబాబు గురు వారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి ఎంపీపీ, జడ్పీటీసీ, ఎంపీటీసీలు, సర్పంచులు, కోఆప్షన్ సభ్యులు హాజరవుతారని పేర్కొన్నారు. మండల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు సమగ్ర సమాచారంతో హాజరు కావాలని కోరారు.

అంకభూపాలపురంలో పారిశుధ్య పనులు

వలేటివారిపాలెం, ఆగస్టు 22 : మండలంలోని అంకభూపాలపురం వీధులను గురువారం పంచాయతీ కార్యదర్శి అనిల్ ఆధ్యర్యంలో శుభ్రం చేశారు. ఎక్స్‌కవేటర్‌తో పిచ్చి మొక్కలు తొలగించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ప్రెగడ మోహన్‌కుమార్, మంగి సురేష్, మల్లెల అంకయ్య, మంగి సుల్తాన్ తదితరులు పాల్గొన్నారు.

నేడు 'ఉపాధి'పై గ్రామసభలు

అల్లూరు, ఆగస్టు 22 : ఉపాధి హామీ పనులపై మండలంలోని అన్నీ గ్రామ పంచాయతీల్లో శుక్రవారం గ్రామసభలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. గ్రామస్థులు ఈ సభలకు హాజరై అవగాహన పొందాలని ఆమె పేర్కొన్నారు.

జలదంకి : మండలంలోని 17పంచాయతీల్లో శుక్రవారం ఉపాధి హామీ పనుల గుర్తింపుపై గ్రామసభలు జరగున్నాయి. సర్పంచిల అధ్యక్షతన జరిగే ఈ గ్రామసభల్లో అవసరమైన పనులు గుర్తించనున్నామని ఉపాధి హామీ ఏపీవో శ్యామల పేర్కొన్నారు.

సబ్‌జైలులో న్యాయ విజ్ఞాన సదస్సు

కావలి: మండల లోక్‌అదాలత్ ఆధ్వర్యంలో స్థానిక సబ్‌జైలులో గురువారం న్యాయవిజ్ఞాన సదస్సు జరిగింది. ఈ సదస్సులో సీనియర్ సివిల్ జడ్జి ఎం. శోభ ముఖ్యఅతిథిగా పాల్గొని ఖైదీలకు చట్టాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో జైలు సూపరింటిండెంట్ చినసుబ్బయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

'ప్రకాశం' అసిస్టెంట్ ప్రొఫెసర్‌కు డాక్టరేట్

కందుకూరు : ప్రకాశం ఇంజనీరింగ్ కాలేజీ ఎలక్ట్రికల్ డిపార్ట్‌మెంట్లో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న ఎస్కే మీరాషరీఫ్ డాక్టరేట్ సాధించారు. చెన్నై సెయింట్ పీటర్స్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ నుంచి ఆయన పీహెచ్‌డీ సాధించినట్లు కాలేజీ కరస్పాండెంట్ కంచర్ల రామయ్య ఒక ప్రకటనలో తెలిపారు.

నష్టపరిహారం చెక్కుల పంపిణీ



బాధితులకు చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు, విద్యుత్‌శాఖ అధికారులు

కందుకూరు, ఆగస్టు 22: పొలాల్లో మేతకు వెళ్లిన గేదెలు విద్యుత్ తీగలు తగిలి మృతి చెందాయి. ఈ ఘటనలో బాధిత రైతులకు విద్యుత్‌శాఖ నుంచి మంజూరైన నష్టపరిహారం చెక్కులను ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు గురువారం అందించారు. వలేటివారిపాలెం మండలం అంకభూపాలపురం గ్రామానికి చెందిన పెగడ రమణయ్య, నరసింహారావులకు చెందిన గేదెలు ఇటీవల పొలాల్లో మేతకు వెళ్లి మృత్యువాత పడ్డాయి. వారిద్దరికీ నష్టపరిహారం కింద రూ. 1.55 లక్షలు మంజూరు కాగా స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో చెక్కులను అందించారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఈఈ ఏ. వీరయ్య, డీఈఈ విజయ్‌బాబు, ఏఈఈ టీ. మధుబాబులు పాల్గొన్నారు.

మెగాస్టార్ చిరంజీవి పుట్టినరోజు వేడుకలు

గుడ్లూరు, ఆగస్టు 22 : మెగాస్టార్ చిరంజీవి జన్మదిన వేడుకలను గురువారం గుడ్లూరులో చిరంజీవి అభిమానులు, జనసేన నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బస్టాండ్ సెంటర్‌లో బాణసంచా కాల్చి, కేక్ కట్‌చేసి, అల్పాహార విందు ఏర్పాటుచేశారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు సన్నిశెట్టి గిరిబాబు, శానం రాజేష్, కొట్టే పుల్లయ్య, ఆలా శివ, చిరంజీవి అభిమానులు మెలిశెట్టి రాజా, పసుపులేటి జానకిరామయ్య, మురారిశెట్టి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.



గుడ్లూరులో కేక్ కట్‌చేస్తున్న చిరంజీవి అభిమానులు



బలిజపాలెంలో మొక్క నాటుతున్న చిరంజీవి అభిమానులు

లింగసముద్రం : మెగాస్టార్ చిరంజీవి పుట్టినరోజు వేడుకలను గురువారం లింగసముద్రంలోని బలిజపాలెంలో చిరంజీవి అభిమానులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని శ్రీకోదండ రామస్వామి ఆలయ కమిటీ చైర్మన్ మాటూరి శ్రీనివాసరావు, శ్రీశ్రీనివాస పబ్లిక్ స్కూల్ చైర్మన్ ఉమ్మడిశెట్టి శ్రీనివాసరావు, గ్రామ పెద్దలు, యువకులు గ్రామంలోని రోడ్లుకిరువైపులా సుమారు 300 మొక్కలు నాటారు.

కందుకూరు మున్సిపల్ కమిషనర్‌గా అనూష

కందుకూరు, ఆగస్టు 22: కందుకూరు మున్సిపల్ కమిషనర్‌గా కె. అనూష నియమితులయ్యారు. 2018 - 19 మధ్యకాలంలో ఆమె కందుకూరు కమిషనర్‌గా బాధ్యతలు నిర్వహించారు. 2019 సార్వత్రిక ఎన్నికలకు ముందు ఆమె ఇక్కడి నుంచి బదిలీ అయ్యారు. ప్రస్తుతం తెనాలి మున్సిపల్ కార్పొరేషన్‌లో అసిస్టెంట్ కమిషనర్‌గా ఉన్న అనూషను కందుకూరు కమిషనర్‌గా నియమిస్తూ పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి ఉత్తర్వులు జారీచేశారు. కందుకూరులో కమిషనర్‌గా ఉన్న కేవీ కృష్ణారెడ్డిని కడప కార్పోరేషన్ అసిస్టెంట్ కమిషనర్‌గా నియమిస్తూ ఉత్తర్వులు జారీచేశారు.

కలుపు నిర్మూలనపై అవగాహన

కందుకూరు, ఆగస్టు 22: స్థానిక కృషి విజ్ఞానకేంద్రం శాస్త్రవేత్తలు పట్టణంలోని కేంద్రీయ విద్యాలయంలో గురువారం వయ్యారిభామ కలుపుమొక్క నిర్మూలనపై అవగాహన నిర్వహించారు. ప్రిన్సిపాల్ అర్జున్‌సింగ్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఈ కార్యక్ర మంలో కేవీకే సీనియర్ సైంటిస్ట్ జీ. ప్రసాద్‌బాబు మాట్లాడారు. కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్తలు వెంకటేష్, నిహారిక, జ్యోతి, మయాంక్ పాల్గొన్నారు.



అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న కేంద్రీయ విద్యాలయం విద్యార్థులు, కేవీకే శాస్త్రవేత్తలు

నెల్లూరు సిటీ, రూరల్
కోవూరు, సర్వేపల్లి

మద్యం అక్రమాలపై సీఐడీ విచారణ

ఎన్నికలలో వైసీపీ నేతలకు భారీగా మద్యం ● ప్రభుత్వ దుకాణాల నుంచే సరఫరా

తాజాగా సీఎం చంద్రబాబుకు సోమిరెడ్డి ఫిర్యాదు ● సీఐడీ విచారణకు ఆదేశం

నెల్లూరు (ఆంధ్రజ్యోతి), ఆగస్టు 22 : ఎన్నికల సమయంలో చెలరేగిన మద్యం మాఫియా చుట్టూ ఉచ్చు బిగుసుకుంటోంది. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో పంపిణీ చేసేందుకు భారీగా మద్యాన్ని వైసీపీ నేతలకు తరలించారు. ప్రభుత్వ దుకాణాల్లో స్కానింగ్ జరిగినట్లు రికార్డులు చూపిస్తున్నా ఆ మద్యం మొత్తం డిపోల నుంచే తరలివెళ్లినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఒక్క సర్వేపల్లి నియోజకవర్గంలోనే రెండు భారీ మద్యం డంప్‌లు పట్టుబడ్డాయి. పంటపాలెం, విరువూరు ప్రాంతాల్లో దొరికిన ఈ డంప్‌లలో 1.44 లక్షల మద్యం బాటిళ్లను ఎన్నికల అధికారులు సీజ్ చేశారు. ఇవన్నీ వైట్‌హాల్, రాయల్ ప్యాలెస్ బ్రాండ్లే కాగా అవన్నీ సర్వేపల్లిలోనే తయారవడం గమనార్హం. ఈ డంప్‌లు వైసీపీ నేతల ఆధీనంలో ఉన్నట్లు నాడు గుర్తించారు. ఆ క్రమంలోనే దాదాపు 17 మంది అరెస్టయ్యారు. వారిలో మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అనుచరులు కూడా ఉన్నారు. అలానే పలువురు మద్యం దుకాణాల సిబ్బంది సస్పెండ్ అయ్యారు. ఇవేగాక మరిన్ని డంప్‌లు వైసీపీ నేతల ఆధీనంలో ఉన్నట్లు నాడు ప్రచారం జరిగింది. దీనిపై నాడు టీడీపీ నేతలు ఫిర్యాదు చేసినా లోతుగా విచారణ జరగలేదు. జిల్లాలో పనిచేస్తున్న ఓ ఎక్సైజ్ ఉన్నతాధికారి ఇందుకు ప్రధాన సూత్రధారి అని, ఆయన కనుసన్నల్లోనే ప్రభుత్వ దుకాణాల నుంచి మద్యం వైసీపీ నేతలకు చేరిందని నాడు ఆరోపణలు వెల్లువెత్తాయి. బేవరేజెస్ కార్పొరేషన్ ఎండీగా పనిచేసి సస్పెండ్ అయిన వాసుదేవరెడ్డికి జిల్లాలో పనిచేస్తున్న సదరు అధికారి బినామీ అన్న ప్రచారం కూడా ఉంది. ఈ నేపథ్యంలో ఎన్నికల సమయంలో జరిగిన మద్యం అక్రమాలపై సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి నారా చంద్రబాబుకు తాజాగా ఫిర్యాదు చేశారు. లక్షల బాటిళ్ల మద్యాన్ని అక్రమ మార్గంలో వైసీపీ నేతలకు చేరవేశారని, ఆ మద్యాన్ని ఎన్నికల సమయంలో పంపిణీ చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. మంగళవారం రాత్రి అమరావతిలోని సచివాలయంలో సీఎంకు కలిసి లేఖను అందజేశారు. దీంతో స్పందించిన సీఎం.. సీఐడీ విచారణకు ఆదేశించినట్లు ఎమ్మెల్యే సోమిరెడ్డి వెల్లడించారు.

క్రమశిక్షణ పాటించని వారిపై చర్యలు

వెంకటాచలం : భారతీయ జనతా పార్టీ క్రమశిక్షణకు మారుపేరని, క్రమశిక్షణ పాటించని వారిపై చర్యలు తప్పవని ఆ పార్టీ మండలాధ్యక్షుడు కుంచి శ్రీనివాసులు యాదవ్ హెచ్చరించారు. గురువారం స్థానిక పార్టీ కార్యాలయంలో బీజేపీ జిల్లా కార్యదర్శి అల్లూరు ప్రసాద్‌నాయుడితో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డిపై తమ పార్టీ నేత పిల్లిపాకుల పెంచలయ్య చేసిన వ్యాఖ్యలు ఆయన వ్యక్తిగతమని అన్నారు. పార్టీ క్రమశిక్షణను ఉల్లంఘించిన పెంచలయ్యపై పార్టీ తప్పకుండా తగు చర్యలు తీసుకుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు ప్రసాద్‌నాయుడు, అనసాపురం శ్రీనివాసులు, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యామ్నాయ పంటలు పండించండి

ముత్తుకూరు : వరికి బదులుగా రైతులు ఈ సీజన్‌లో ప్రత్యామ్నాయ పంటలను సాగు చేసుకోవాలని వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు రాజ్‌కుమార్ సూచించారు. గురువారం బ్రహ్మదేవం, తాళ్లపూడి, మల్లూరు గ్రామాల్లో రైతు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త కిరణ్ జీవరసాయన ఎరువుల గురించి వివరించారు. క్షేత్రస్థాయిలో వరి వేరుశెనగ పొలాలను పరిశీలించి సస్యరక్షణ చర్యలను సూచించారు.

వైద్యురాలిపై హత్యాచారం అమానుషం



మానవహారం చేసిన విద్యార్థినులు

కోవూరు, ఆగస్టు 22: ఇటీవల కోల్‌కత్తాలో వైద్యురాలిపై హత్యాచారం అమానుషమని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మీప్రసూన అన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం ఆమె వైద్యురాలికి నివాళులర్పించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు పనిచేసే చోట రక్షణ కల్పించాలన్నారు. అనంతరం విద్యార్థులు పట్టణంలో ప్రదర్శన చేసి మానవహారం చేపట్టారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రామప్రసాద్‌రెడ్డి, మహిళా సాధికారత కమిటీ కన్వీనర్ డాక్టర్ కే లావణ్య, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ మధుసూదనరావు, అధ్యాపకులు కే శోభారాణి, కే సువర్ణ తదితరులు పాల్గొన్నారు. అలాగే స్థానిక జడ్పీ బాలికోన్నత పాఠశాల విద్యార్థినులు పట్టణ వీధుల్లో ప్రదర్శన చేశారు. ఈ ప్రదర్శనలో ఎంఈవో చెంచమ్మ, ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయిని జాన్సీ ఉపాధ్యాయినులు పాల్గొన్నారు.

పంచాయతీ ఎన్నికలకు ఇంటింటా సర్వే నిర్వహించాలి

మనుబోలు, ఆగస్టు 22: వచ్చే ఏడాదిలో నిర్వహించబోయే పంచాయతీ ఎన్నికలకు సంబంధించి గ్రామాల్లో బీఎల్‌వోలు ఇంటింటి సర్వే నిర్వహించాలని తహసీల్దార్ సుబ్బయ్య కోరారు. స్థానిక మండలపరిషత్ కార్యాలయంలో గురువారం బీఎల్‌వోలతో సమావేశం నిర్వహించారు. బీఎల్‌వోలు ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం అక్టోబర్ 18 కల్లా ఇంటింటా సర్వే పూర్తిచేయాలన్నారు. ప్రస్తుత ఓటర్ల జాబితాలోని తప్పుఒప్పులను సరిచేయాలన్నారు. అలాగే ఓటు లేనివారిచేత నమోదు చేయించాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ శివప్రసాద్, బీఎల్‌వోలు పాల్గొన్నారు.

ఎంపీడీవో కార్యాలయం పరిశీలన

పొదలకూరు, ఆగస్టు 22: పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయాన్ని గురువారం ఏపీ పంచాయతీరాజ్ డైరెక్టర్ యం కృష్ణతేజ పరిశీలించారు. ఎంపీడీవో కార్యాలయంలోని గదులను, వసతులను, కంప్యూటర్ రూమ్‌ను పరిశీలించారు. అనంతరం వర్మీకంపోస్టు ఎరువు తయారీ విధానం, క్రయవిక్రయాల సమాచారంపై ఆరా తీశారు. ఎన్ఆర్ఈజీఎస్ పనుల వివరాలను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో నగేష్‌కుమారి, కార్యాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి : సీఈవో



ఎలక్ట్రికల్ లోడర్‌ను ప్రారంభిస్తున్న సీఈవో జీజేరావు

ముత్తుకూరు, ఆగస్టు 22 : పర్యావరణ పరిరక్షణకు నిరంతరం కృషి చేస్తున్నట్లు అదానీ కృష్ణపట్నం పోర్టు సీఈవో జీజేరావు అన్నారు. పోర్టులో గురువారం ఎలక్ట్రికల్ వోల్వో లోడర్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ఏ పోర్టులో లేనివిధంగా అదానీ కృష్ణపట్నం పోర్టు ఎలక్ట్రికల్ లోడర్‌లను ఉపయోగించడంలో రికార్డు సృష్టించామన్నారు. ఎలక్ట్రికల్ లోడర్ వలన కాలుష్య నివారణతోపాటు పర్యావరణానికి ఎంతో మేలు జరుగుతుందని ఆయన తెలిపారు. రాబోయే రోజుల్లో పోర్టులో ఎక్కువ శాతం ఎలక్ట్రికల్ వాహనాలను వినియోగించి కాలుష్య నివారణ, పర్యావరణ పరిరక్షణకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సీఓఓ రాజన్‌బాబు, లాజిస్టిక్స్ హెడ్ శ్రీధర్, సేఫ్టీ మేనేజర్ వేణు, టెక్నో కమర్షియల్ హెడ్ రమేష్‌బాబు, కోల్ యార్డ్ హెడ్ విజయ్ మజ్జి, ఈహెచ్ హెడ్ వేణుగోపాల్‌రెడ్డి, రామకృష్ణ, గంగా సతీష్, తదితరులు పాల్గొన్నారు.

గ్రామ సభలను విజయవంతం చేయాలి

విడవలూరు, ఆగస్టు 22: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన గ్రామసభలను అధికారులు విజయవంతంగా నిర్వహించాలని ఎంపీడీవో శ్రీనివాసులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామసభల్లో పంచాయతీల్లో చేపట్టాల్సిన పనులను గ్రామస్థులతో చర్చించి అధికారులకు పంపటం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమానికి పంచాయతీ ప్రతినిధులు, స్థానిక నేతలు హాజరుకావాలన్నారు.

●**వెంకటాచలం:** గ్రామాల్లో సమస్యలను పరిష్కరించేందుకే శుక్రవారం సర్వేపల్లి నియోజకవర్గ వ్యాప్తంగా గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు జనసేన పార్టీ సర్వేపల్లి నియోజకవర్గ సమన్వయకర్త బొబ్బేపల్లి సురేష్‌నాయుడు తెలిపారు. మండలంలోని సర్వేపల్లిలో ఆపార్టీ కార్యాలయంలో గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి సారథ్యంలో జరిగే గ్రామసభల్లో జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో పినిశెట్టి మల్లికార్జున్, సండూరి శ్రీహరి, ఆస్తోటి రవికుమార్, చల్లా చెంచయ్య, ఉప్పు పెంచలయ్య తదితరులున్నారు.

●**మనుబోలు:** ఈ ఆర్థిక సంవత్సరంలో ఉపాధిహామి పథకం ద్వారా చేపట్టబోయే పనులకు సంబంధించి శుక్రవారం మండలంలోని 14 సచివాలయాల్లో గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు ఏపీవో రాజమ్మ గురువారం తెలిపారు. ఈ సభలకు కూలీలు, అధికారులు, ప్రజాప్రతినిధులు తప్పకుండా హాజరుకావాలని కోరారు.

టీడీపీ నేత పచ్చిపాలకు నివాళి

మనుబోలు, ఆగస్టు 22: స్థానిక టీడీపీ సీనియర్ నేత పచ్చిపాల లక్ష్మణరెడ్డి (68) బుధవారం రాత్రి అనారోగ్యంతో మరణించారు. గురువారం నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, ఆయన సోదరుడు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, సర్వేపల్లి టీడీడీ సమన్వయకర్త సోమిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి మనుబోలులో పచ్చిపాల నివాసానికి చేరుకుని నివాళులు అర్పించారు. అలాగే మండలంలోని పలుపార్టీల రాజకీయ నాయకులు పచ్చిపాలకు నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు రామకృష్ణయ్య, మధునాయుడు, కిరణ్‌కుమార్, చేరెడ్డి పట్టాభి రామిరెడ్డి, కలికి సోదరులు పాల్గొన్నారు.

మహిళ అదృశ్యంపై కేసు

బుచ్చిరెడ్డిపాళెం, ఆగస్టు 22: బుచ్చిరెడ్డిపాళెంలోని రామకృష్ణానగర్‌కు చెందిన ఆరం పార్వతి(44) తప్పిపోయిందని కొడుకు ఆరం మణికంఠ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ శ్రీనివాసులురెడ్డి తెలిపారు. బుధవారం ఇంటినుంచి వెళ్ళిన పార్వతి తిరిగి ఇంటికి రాలేదు. పలు చోట్ల గాలించినా ఆచూకీ లేకపోవడంతో కొడుకు ఫిర్యాదు చేసినట్టు వారు తెలిపారు.

ఆర్టీసీ బస్సు - బొలెరో ట్రక్ ఢీ

● నలుగురికి గాయాలు

రాపూరు, ఆగస్టు 22: మండలంలోని చిట్వేల్ మార్గమధ్యలోని ఘాట్ రోడ్డులో గురువారం రాత్రి ఆర్టీసీ బస్సును బొలేరో ట్రక్ ఢీకొనడంతో ట్రక్‌లో ప్రయాణిస్తున్న నలుగురు మహిళలు స్వల్పంగా గాయపడ్డారు. డక్కిలి మండలం తురకపల్లికి చెందిన 8మంది రాజంపేటకు వెళ్లి ట్రక్‌లో తిరిగి వస్తుండగా నెల్లూరు నుంచి రాజంపేటకు వెళ్లే నెల్లూరు డిపోకు చెందిన బస్సును బొలెరో ట్రక్ ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. గాయపడిన వారిని రాపూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ప్రమాదంలో బొలెరో ట్రక్.. ఆర్టీసీ బస్సు దెబ్బతిన్నాయి. పోలీసులు కేసు నమోదు చేశారు.

కట్టుబడిపాళెంలో ముదిరిన వివాదం



దగ్ధమైన ఇంటి వద్ద పోలీసు బందోబస్తు

బుచ్చిరెడ్డిపాళెం, ఆగస్టు 22: బుచ్చి నగర పంచాయతీ కట్టుబడిపాళెంలో వడ్డిపాళెంలో ఓ సామాజిక వర్గంలోని ఇరువర్గాల మధ్య రేగిన వివాదం ముదిరి బుధవారం అర్ధరాత్రి ఓ వర్గంలోని చంద్రగిరి రమణయ్య ఇంటిని గుర్తుతెలియని వ్యక్తులు తగులబెట్టారు. పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలు అదుపుచేశారు. గురువారం ఉదయం సీఐ శ్రీనివాసులురెడ్డి సంఘటనా స్థలాన్ని పరిశీలించి విచారించారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు, మళ్ళీ వివాదాలు తలెత్తకుండా పలువురిని అదుపులోకి తీసుకున్నట్టు తెలిపారు.

వర్షంతో వరి పంటకు నష్టం

మండలంలో గురువారం సాయంత్రం కురిసిన ఈదురు గాలులతో వర్షానికి వరిపంట నేలవాలింది. ఇంకా వర్షాలు కురిస్తే వెన్నుదశలో ఉన్న వరి ధాన్యం గింజలు మొలకెత్తే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

ఉద్యోగులకు జీతాల చెల్లింపు

మండలంలోని జొన్నవాడ మల్లికార్జునస్వామి, కామాక్షితాయి ఆలయంలో రెగ్యులర్ ఉద్యోగులకు గురువారం జీతాలు చెల్లించినట్టు ఆలయ కార్యనిర్వహణాధికారి ఏవీ శ్రీనివాసులురెడ్డి తెలిపారు. జూన్ నెల నుంచి ఆలయంలో ఉద్యోగులకు జీతాలు చెల్లించలేదనే విషయం విదితమే. ఈమేరకు 17మంది రెగ్యులర్ ఉద్యోగులకు జీతాలు చెల్లించారు. ఇక ఔట్‌సోర్సు, కాంట్రాక్టు ఉద్యోగులకు ప్రీ ఆడిట్ అనంతరం జీతాలు చెల్లించనున్నట్టు ఈఓ తెలిపారు.

ప్రతిష్టాత్మకంగా రాష్ట్రస్థాయి టీ-20 క్రికెట్ పోటీలు

నెల్లూరు(విద్య), ఆగస్టు 22 : వెటరన్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా క్రికెట్ అసోసియేషన్ పర్యవేక్షణలో బుజబుజనెల్లూరులోని సీఏఏ క్రికెట్ మైదానంలో గురువారం సీనియర్ క్రీడాకారులు తాటిపర్తి సునీల్‌కుమార్ స్మారకార్థం రాష్ట్రస్థాయి ఇన్విటేషన్ వెటరన్ టీ-20 క్రికెట్ పోటీలు నిర్వహించారు. నాలుగు రోజుల పాటు జరిగే ఈ పోటీలను ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ సభ్యుడు పీ.భానుప్రకాష్ రెడ్డి ప్రారంభించి మాట్లాడారు. ఈ పోటీలకు హైదరాబాద్, అనంతపురం, కడప, గుంటూరు, కృష్ణ, నెల్లూరు జిల్లాలకు చెందిన సీనియర్ వెటరన్ క్రీడాకారులు హాజరవుతారన్నారు. తొలిరోజు ఉదయం జరిగిన మ్యాచ్‌లో గుంటూరు, అనంతపురం జట్లు తలపడగా గుంటూరు జట్టు విజయం సాధించింది. మధ్యాహ్నం జరిగిన రెండో మ్యాచ్‌లో నెల్లూరు, విజయవాడ జట్లు తలపడగా తొలుత బ్యాటింగ్ చేపట్టిన నెల్లూరు జట్టు 202 పరుగులు సాధించగా అనంతరం బ్యాటింగ్ చేసిన విజయవాడ జట్టు ఆరు వికెట్లు కోల్పోయి 17 ఓవర్లలో 167 పరుగులు సాధించింది. ఈ క్రమంలో వర్షం పడడంతో డీఎల్ఎస్ పద్ధతిలో నెల్లూరు జట్టు 7 పరుగుల తేడాతో విజయం సాధించినట్లు అంపైర్లు ప్రకటించారు.



మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు అందుకుంటున్న భరత్‌కుమార్

గ్రామ సభలను సద్వినియోగం చేసుకోవాలి

● ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి



దివ్యాంగుడికి ఆర్థిక సహాయం అందచేస్తున్న వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి

నెల్లూరు(హరనాథపురం), ఆగస్టు 22 : గ్రామాల్లో ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిర్వహించే గ్రామ సభలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి కోరారు. నగరంలోని ఆమె నివాసంలో గురువారం విలేకరులతో మాట్లాడుతూ పంచాయతీ పరిధిలో గ్రామ సభల ద్వారా సమష్టి నిర్ణయాలు తీసుకునే ప్రజాస్వామిక సంప్రదాయాన్ని గత ప్రభుత్వం విస్మరించిందని ఆరోపించారు. గ్రామ సభలు తిరిగి నిర్వహించడం ద్వారా ఆ సంప్రదాయాన్ని తిరిగి కొనసాగించాలన్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌ల ఆలోచన మేరకు ప్రతి పంచాయతీలో గ్రామసభ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. గ్రామ సభల్లో స్థానిక సమస్యలను అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తేవాలని ప్రజలను కోరారు. కాగా, బుచ్చిరెడ్డిపాళెం మండలం దామరమడుగుకు చెందిన కడియంపాటి పద్మనాభం అనే రైతుకు రోడ్డు విస్తరణ పరిహారం రూ.5.71 లక్షలను ఎమ్మెల్యే అందజేశారు.

● **దివ్యాంగుడికి ఆర్థిక సాయం**

రైలు ప్రమాదంలో రెండుకాళ్లు కోల్పోయిన దివ్యాంగుడికి నెల్లూరు పార్లమెంటు సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి గురువారం ఆయన నివాసంలో రూ.50వేల ఆర్థిక సహాయం అందచేశారు. ఇందుకూరుపేట మండలంలోని గంగపట్నం పల్లిపాళెంకు చెందిన పొనవాడ రమేష్‌బాబు రైలు ప్రమాదంలో తన రెండు కాళ్లు కోల్పోయారు. పిల్లల్ని చదివించే ఆర్థిక స్తోమత లేదని మొరపెట్టుకోవడంతో ఆయన తన వీపీఆర్ ఫౌండేషన్ ద్వారా ఈ ఆర్థిక సహాయాన్ని అందచేశారు.

రోడ్లను ఆక్రమిస్తే జరిమానా : కమిషనర్



రోడ్డు ఆక్రమణలను పరిశీలిస్తున్న కమిషనర్

నెల్లూరు(సిటీ), ఆగస్టు 22 : వాహనాలు వెళ్లనివ్వకుండా, నడిచేవారికి వీలు లేకుండా రోడ్లను ఆక్రమిస్తే భారీగా జరిమానాలతో పాటు కఠిన చర్యలు తీసుకుంటామని ఎన్ఎంసీ కమిషనర్ ఎం.సూర్యతేజ హెచ్చరించారు. గురువారం నగరంలోని పాతమున్సిపల్ కార్యాలయం నుంచి ఏసీ కూడలి, ట్రంకురోడ్డు వరకు పరిశీలించారు. రోడ్లు ఆక్రమించి దుకాణాలు ఏర్పాటు చేయడాన్ని గుర్తించిన ఆయన వారితో చర్చించారు. ఫుట్‌పాతులను పూర్తిగా నిర్వీర్యం చేశారని ఆగ్రహించారు. రోడ్లు ఆక్రమించుకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఏసీ కూడలి వద్ద బార్ అండ్ రెస్టారెంట్ నిర్వాహకుడు రోడ్డుపైనే వ్యర్థాలు వేయడాన్ని గుర్తించి మండిపడ్డారు.

రూ.4 కోట్లతో 300 ఎకరాల్లో నగరవనం

● త్వరలో సీఎం చేతుల మీదుగా ప్రారంభం : రూరల్ ఎమ్మెల్యే



నగర వనంలో జిమ్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

నెల్లూరు(సిటీ), ఆగస్టు 22 : రాష్ట్రానికే గర్వకారణం గా రూ.4 కోట్లతో 300 ఎకరాల్లో నగర వనాన్ని నిర్మించినట్లు నెల్లూరురూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి తెలిపారు. గురువారం సంబంధిత అధికారులతో కలిసి వనాన్ని పరిశీలించి మాట్లాడారు. ఎంతో అద్భుతంగా అన్ని వసతులు కల్పించి దీనిని నిర్మించినట్లు తెలిపారు. త్వరలో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ చేతులు మీదుగా దీనిని ప్రారంభింపచేస్తామన్నారు. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు దీనిని సుందరంగా తీర్చిదిద్దేందుకు కష్టించిన ఫలితం లేకుండా పోయిందన్నారు. రాష్ట్రంలో ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పనులు చకచక జరుగుతున్నాయని, మరో 15 రోజుల్లో పూర్తి హంగులు అందుబాటులోకి వస్తాయన్నారు. నగర వాసులందరూ ఇక్కడకి వచ్చి ఆహ్లాదం పొందాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మలినేని వెంకయ్యనాయుడు, బత్తల క్రిష్ణ, చక్కా సునీల్, మన్నేపల్లి రఘు, తదితరులు పాల్గొన్నారు.

చిరంజీవిని కలిసిన సుజయ్‌బాబు



నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), ఆగస్టు 22: తిరుమలకు గురువారం శ్రీవారిని దర్శించుకునేందుకు వచ్చిన మెగాస్టార్ చిరంజీవిని జనసేన పార్టీ నగర అధ్యక్షుడు దుగ్గిశెట్టి సుజయ్‌బాబు మర్యాదపూర్వకంగా కలిసి వేంకటేశ్వర స్వామి మెమెంటో అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మంత్రి ఆనం రామనారాయణరెడ్డితో కలిసి చిరంజీవితో పాటు శ్రీవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా సుజయ్‌బాబు మాట్లాడుతూ చిన్నతనం నుంచి ఎంతగానో అభిమానించే మా హీరో చిరంజీవిని ఆయన జన్మదినం రోజు కలవడం ఆనందంగా ఉందన్నారు.

● **చిరంజీవి పుట్టినరోజు వేడుకలు**

మెగాస్టార్ చిరంజీవి పుట్టినరోజు వేడుకలను నగరంలోని చిరంజీవి యువత అధ్యక్షుడు మార్కెట్ సురేష్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కూరగాయల మార్కెట్ వద్ద ఉన్న సాయిబాబా మందిరంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భారీ కేక్ కట్‌చేసి ప్రజలకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో చిరంజీవి యువత నాయకులు మేకల ప్రసాద్ యాదవ్, గుర్రం కిషోర్, సర్వేపల్లి సునీల్, రాము, తదితరులు పాల్గొన్నారు.

రిథమ్ స్పీచ్, హియరింగ్ సెంటర్ ప్రారంభం

నెల్లూరు(వైద్యం), ఆగస్టు 22 : నగరంలోని పొగతోటలో కొత్తగా ఏర్పాటు చేసిన రిథమ్ స్పీచ్, హియరింగ్ సెంటర్‌ను గురువారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పెంచలయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెంటర్ నిర్వాహకులు పసి పిల్లలకు ఓఏ, బీరా పరీక్షలు నిర్వహించడంతో పాటు మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు. ఐఎంఏ రాష్ట్ర నాయకుడు డాక్టర్ అశోక్ మాట్లాడుతూ మాటలు రానివారికి వినికిడి పరీక్షలు, వినికిడి యంత్రాలు ఇక్కడ అందుబాటులో ఉంటాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో రిథమ్ స్పీచ్ నిర్వాహకుడు, సైకాలజిస్ట్ సురేష్, ఆడియాలజిస్ట్ డాక్టర్ శ్రీహరి, రిచ్ ఆసుపత్రి సీఈవో డాక్టర్ భాస్కర్, డాక్టర్ సుభాని, డాక్టర్ దేసు మరళీకృష్ణ, డాక్టర్ రాజేష్, డాక్టర్ యామిని, డాక్టర్ హర్షవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

పెన్నాలో మునిగి లారీ డ్రైవర్ మృతి

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), ఆగస్టు 22: పెన్నానదిలో మునిగి లారీడ్రైవర్ మృతి చెందాడు. పోలీసుల సమాచారం మేరకు.. నెల్లూరు వారధి సెంటర్‌కు చెందిన బీ.వెంకటరమణయ్య(52)కు అన్నమయ్య జిల్లా మదనపల్లికి చెందిన నాగవేణితో వివాహమైంది. ప్రస్తుతం ఈయన అదే జిల్లా పీలేరులో ఉంటూ లారీడ్రైవర్‌గా పని చేస్తున్నాడు. తరచూ నెల్లూరు పెన్నావారధి సెంటర్‌లో ఉంటున్న చెల్లెలు లక్ష్మి ఇంటికి వచ్చి వెళ్లేవారు. ఈనెల 20వ తేదీన నెల్లూరుకు వచ్చిన వెంకటమణయ్య 21న ఇంట్లో నుంచి బయటకు వెళ్లి తిరిగి రాకపోవడంతో పీలేరుకు వెళ్లి ఉంటాడని చెల్లెలు భావించింది. గురువారం మధ్యాహ్నం పెన్నానదిలో ఓవ్యక్తి మృతదేహం నీటిపై తేలియాడుతోందని స్థానికులు చెప్పడంతో ఆమె వెళ్లి పరిశీలించారు. మృతదేహం చూసి తన అన్నదేనంటూ కన్నీరుమున్నీరయ్యారు. సంతపేట పోలీసులు కేసు నమోదు చేశారు.

వసతి గృహాల్లో టంగుటూరి జయంతి నిర్వహించాలి

నెల్లూరు(హరనాథపురం), ఆగస్టు 22 : అన్ని సంక్షేమ వసతి గృహాల్లో ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి కార్యక్రమాలు నిర్వహించాలని జిల్లా బీసీ సంక్షేమాధికారి వెంకటయ్య హెచ్‌డబ్ల్యూవోలను కోరారు. ప్రభుత్వ వేడుకగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ జన్మదిన వేడుకలు విజయవంతం చేయాలి

నెల్లూరు(సాంస్కృతికం), ఆగస్టు 22 : జనసేన అధినేత, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ జన్మదిన వేడుకలను పవన్‌కళ్యాణ్ అభిమానులు, జనసేన పార్టీ నాయకులు విజయవంతం చేయాలని పవన్‌కళ్యాణ్ రాష్ట్ర అభిమాన సంఘం అధ్యక్షుడు పి.టోనిబాబు పిలుపునిచ్చారు. గురువారం జర్నలిస్టు భవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ వేడుకలను వారోత్సవాలుగా నిర్వహించి పలు సేవా కార్యక్రమాలు చేపడుతామన్నారు. ఈనెల 27 నుంచి సెప్టెంబరు 2వ తేదీ వరకు వేడుకలు జరుగుతాయని తెలిపారు. 27న మొక్కలు, 28న మహిళలకు చీరలు, 29న విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ, 30న దివ్యాంగులకు అన్నదానం, 31న కేక్ కటింగ్, సెప్టెంబరు 1న జనసేన జెండా ఆవిష్కరణ, 2న మెగా రక్తదాన శిబిరాలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో షానవాజ్, షఫీ, రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన మాజీ ఎంపీ ఆదాల

నెల్లూరు(హరనాథపురం), ఆగస్టు 22 : మాజీ ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి గురువారం కలెక్టర్ ఆనంద్‌ను కలిశారు. ఉప్పుటూరు గ్రామ రైతుల సమస్యలపై చర్చించారు. కార్యక్రమంలో డీసీసీబీ మాజీ చైర్మన్ ఆనం విజయ కుమార్‌రెడ్డి, మంగళపూడి శ్రీకాంత్‌రెడ్డి, మల్లు సుధాకర్ రెడ్డి, హరిబాబు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సంకటహర చతుర్థి

నెల్లూరు(సాంస్కృతికం), ఆగస్టు 22 : నగరంలోని మహాత్మాగాంధీ నగర్ కృష్ణమందిరంలో గురువారం సాయంత్రం సంకట హరచతుర్థి పూజలు జరిగాయి. వరసిద్ధి విఘ్నేశ్వరస్వామికి పంచామృతాభిషేకం, సుగుంధ పరిమళ ద్రవ్యాలతో అభిషేకాలు, అలంకరణ పూజలు జరిగాయి. భక్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. ఈ పూజలకు ఉభయకర్తలుగా రామసుబ్బు, వాసుకి, కనక రాజు, శరణ్య దంపతులు వ్యవహరించారు. ఆలయ ప్రధాన అర్చకులు బి.శ్రీనివాసాచార్యులు, ధర్మకర్తలు పర్యవేక్షించారు.

మహిళల ఆర్థిక స్వావలంబనతోనే సమాజాభివృద్ధి

● నెహ్రూ యువ కేంద్ర కో ఆర్డినేటర్ మహేందర్‌రెడ్డి

నెల్లూరు(సాంస్కృతికం), ఆగస్టు 22: మహిళల ఆర్థిక స్వావలంబనతోనే సామాజాభివృద్ధి సాధ్యమని నెహ్రూ యువ కేంద్రం కో ఆర్డినేటర్ ఏ.మహేందర్‌రెడ్డి అన్నారు. గురువారం నగరంలోని ఆబైండింగ్ ట్రస్ట్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ గ్రామాలు, పట్టణాల్లో కులవృత్తులు, స్వయం ఉపాధి పనులు, వ్యవసాయ పనుల్లో మహిళలు ముందంజలో ఉన్నారని, మారిన పరిస్థితుల్లో వారికి ఉపాధి కల్పించేందుకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విశిష్ట కృషి చేస్తున్నాయన్నారు. అందుకు దాతలు కూడా తోడ్పడాలని కోరారు. అనంతరం శిక్షణ పూర్తి చేసిన 18 మంది మహిళలకు ట్రస్ట్ చైర్మన్ బ్రదర్ నిర్మల్‌కుమార్ ఉచితంగా కుట్టుమిషన్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో జనసేన నేత కిషోర్, జయప్రకాష్, డేవిడ్ లివింగ్‌స్టన్, ఇన్‌స్ట్రక్టర్ శోభ, తదితరులు పాల్గొన్నారు.

లెప్రసీ బాధితులకు పాదరక్షల పంపిణీ

నెల్లూరురూరల్, ఆగస్టు 22 : మండలంలోని ఆమంచర్ల వద్దనున్న సేవాజ్యోతి కాలనీలో లెప్రసీ వ్యాధి బాధితులకు జిల్లా అదనపు డీఎంహెచ్‌వో ఖాదర్‌వలీ సౌత్ మోపూరు పీహెచ్‌సీ వైద్యులతో కలిసి గురువారం పాదరక్షలు పంపిణీ చేశారు. అలాగే బాధితులకు అవసరమైన వైద్య సామగ్రిని అందచేశారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఎల్‌హెచ్ఎంఎస్‌తో దుండగుల పరారు

నెల్లూరు(క్రైం), ఆగస్టు 22: ఇంట్లో అమర్చిన ఎల్‌హెచ్ఎంఎస్ పరికరం పోలీసులను అప్రమత్తం చేయడంతో ఆ ఇంట్లోకి దొంగతనానికి యత్నించిన దుండగులు అక్కడ నుంచి పరారయ్యారు. నగరంలోని వెంకటేశ్వరపురం ఇస్లాంపేటలోని లక్ష్మీవీధిలో ఇరిగేషన్ ఉద్యోగి శ్రీధర్ నివాసం ఉంటున్నారు. ఆయన రెండు రోజుల కిందట కుటుంబ సభ్యులతో కలిసి ఊరు వెళ్లారు. ఆయన ముందుగా ఎల్‌హెచ్ఎంఎస్‌లో దరఖాస్తు చేసుకోగా పోలీసులు ఇంట్లో కెమెరా అమర్చారు. ఈ క్రమంలో గురువారం తెల్లవారుజామున గుర్తుతెలియని దుండగులు ఇంట్లో చోరీకి యత్నించారు. అప్పటికే ఇంట్లో అమర్చిన కెమెరాలోని అలారమ్ మోగడంతో పాటు పోలీసు కంట్రోల్ రూమ్‌కు హెచ్చరికలు వెళ్లాయి. నవాబుపేట పోలీసులు అప్రమత్తమై సంఘటనా స్థలానికి చేరుకునేసరికి దుండగులు అక్కడ నుంచి పరారయ్యారు.



జన్మదినాన శ్రీవారి సన్నిధిలో

మెగాస్టార్ చిరంజీవి తన పుట్టినరోజు సందర్భంగా గురువారం కుటుంబ సమేతంగా తిరుమల వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. వేకువజామున సంప్రదాయ వస్త్రధారణతో సుప్రభాత సేవలో పాల్గొన్నారు. ఆలయం లోపల, బయట పలువురు యాత్రికులు చిరంజీవిని చూసి సంబరపడ్డారు. సెల్ఫీలు దిగేందుకు పోటీపడ్డారు. - తిరుమల, ఆంధ్రజ్యోతి

గ్రామాల్లో సమస్యలను గుర్తించండి

● పంచాయతీల్లో నేటి సభలపై కలెక్టర్ ఆదేశం

తిరుపతి(విద్య), ఆగస్టు 22 : జిల్లావ్యాప్తంగా పంచాయతీ కేంద్రాల్లో నేడు నిర్వహించనున్న గ్రామసభల్లో పల్లెసీమల్లో నెలకొన్న సమస్యలను గుర్తించాలని కలెక్టర్ వెంకటేశ్వర్ అధికారులకు సూచించారు. కలెక్టరేట్‌లో ఆయన బుధవారం గ్రామసభల నిర్వహణపై సమీక్షించారు. ఉపాధి హామీ పనులపై అవగాహన కల్పించాలని, గ్రామాల్లో కనీస సౌకర్యాలైన రోడ్లు,విద్య, వైద్యం, తాగునీరు, విద్యుత్తు అంశాలపై చర్చించాలన్నారు. ప్రతి గ్రామాన్నీ స్వర్ణగ్రామంగా తయారు చేయడానికి గ్రామ విజన్ డాక్యుమెంట్ తయారు చేయాలని ఆదేశించారు. ప్రజాప్రతినిధులందరూ ఈ సభల్లో పాల్గొనేలా చూడాలన్నారు.



చంద్రయాన్-3 రాకెట్

● నేడు జాతీయ అంతరిక్ష దినోత్సవం

54 ఏళ్ల కిందట బుడిబుడి అడుగులతో ప్రారంభమైన భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ(ఇస్రో) ప్రయాణం నేడు అంతర్జాతీయస్థాయిలో ప్రశంసలందుకునే స్థాయికి ఎదిగింది.ఇస్రో ప్రయోగించే రాకెట్ల నుంచి ఉపగ్రహాలను పంపేందుకు ఎన్నో దేశాలు క్యూ కడుతున్నాయి.1969లో తుంబా నుంచి చిన్నచిన్న సౌండింగ్ రాకెట్లతో ప్రయోగాలకు శ్రీకారం చుట్టిన ఇస్రో తొలి ఉపగ్రహం ఆర్యభట్ట ప్రయోగంతో నిర్ణయాత్మక దశకు చేరింది.అక్కడినుంచి చంద్రయాన్-3 ప్రయోగ విజయం వరకూ ఎన్నో మార్లు దేశ కీర్తి ప్రతిష్టలను ప్రపంచ దేశాలకు చాటిచెప్పింది.ఇస్రో చరిత్రలో గొప్ప మైలురాయి చంద్రయాన్-3 ప్రయోగం విజయవంతం కావడమే కాకుండా గత ఏడాది ఆగస్టు 23న చంద్రయాన్-3లో పంపిన ప్రజ్ఞాన్, రోవర్ చంద్రుడిపై సేఫ్‌గా ల్యాండ్ కావడంతో దేశంలో సంబరాలు ప్రారంభమయ్యాయి. దీంతో ఆ రోజును భారత ప్రభుత్వం జాతీయ అంతరిక్ష దినోత్సవంగా ప్రకటించింది.ఈ ఏడాది ఇస్రో, భారత ప్రభుత్వం, షార్ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా అంతరిక్ష దినోత్సవాలను నెల రోజుల పాటు వివిధ ప్రాంతాల్లో నిర్వహించారు.శుక్రవారం న్యూఢిల్లీలో జాతీయ అంతరిక్ష దినోత్సవాన్ని ఇస్రో ఆధ్వర్యంలో నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రపతి పాల్గొంటారు.

షార్ ఎదిగిందిలా....

ఇస్రో విజయాల్లో శ్రీహరికోటలోని షార్‌కు ప్రముఖ పాత్రే వుంది. 1969లో శ్రీహరికోటను రాకెట్ కేంద్రంగా ప్రకటించారు 1971లో రోహిణి -125 సౌండింగ్ రాకెట్ ప్రయోగాత్మక పరీక్షలు జరపడంతో కార్యకలాపాలు ప్రారంభమయ్యాయి. 1969-79 మధ్యలో కాలంలో ఇక్కడ నుంచి ప్రయోగాలు చేసేందుకు అవసరమైన సౌకర్యాలను ఏర్పాటు చేసుకున్నారు.తొలిసారిగా 1979 ఆగస్టు 10న ఎస్ఎల్‌వీ రాకెట్ ప్రయోగం చేపట్టారు. 1987లో ఏఎస్ఎల్వీ, చిన్న ఉపగ్రహాలను పంపారు. 1993 సెప్టెంబరు 20న పీఎస్ఎల్వీ ప్రయోగాలకు ఇస్రో ఇక్కడినుంచే శ్రీకారం చుట్టింది.వరుస విజయాలను అందుకొని చరిత్ర సృష్టించింది. చంద్రయాన్-1 కూడా పీఎస్ఎల్వీ వాహక నౌక ద్వారానే ప్రయోగించడం విశేషం. అధిక బరువు గల ఉపగ్రహాలను పంపేందుకు 2001లో జీఎస్ఎల్వీ రాకెట్ ప్రయోగాలకు శ్రీకారం చుట్టింది. అనంతరం 2014లో జీఎస్ఎల్వీ-మార్క్ 3 ప్రయోగం చేపట్టింది. మళ్లీ ప్రయోగ ఖర్చును తగ్గించేందుకు 2022 ఆగస్టు 7న ఎస్ఎస్ఎల్వీ ప్రయోగాలకు శ్రీకారం చుట్టి వాణిజ్యపరంగా దూసుకెంది. ఇస్రో ఇప్పటికి ఆరు రకాల వాహక నౌకలు రూపొందించి 97 ప్రయోగాలు చేపట్టింది. చిన్న ప్రయోగాల నుంచి చంద్రయాన్-1, మంగళయాన్, ఆదిత్య-ఎల్ 1 వంటి భారీ ప్రయోగాలను విజయవం తంగా చేపట్టింది.చంద్రయాన్-2 చివరి నిమిషంలో విఫలమైనా చంద్రయాన్-3 ప్రయోగం ద్వారా సాఫ్ట్ ల్యాండింగ్ చేయడంలో శాస్త్రవేత్తలు విజయం సాధించారు. భవిష్యత్‌లో గగన్‌యాన్ ద్వారా మానవుడిని అంతరిక్షంలోకి పంపడమే ఇస్రో లక్ష్యంగా పెట్టుకుంది. ఇందుకు సంబంధించిన పలు పరీక్షలను విజయవంతంగా నిర్వహిస్తోంది.

- సూళ్లూరుపేట

వరదయ్యపాళెం ఏఎస్ఐ సస్పెన్షన్

వరదయ్యపాళెం, ఆగస్టు 22: విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఏఎస్ఐ షణ్ముగాన్ని ఎస్పీ సుబ్బరాయుడు బుధవారం సస్పెండ్ చేశారు.వరదయ్యపాళెంలో గత ఆదివారం రాత్రి 10.45గంటలకు ఇందిరానగర్‌కు చెందిన ఇద్దరు యువకులు గొడవపడ్డారు.వారిలో ఒకరు రాత్రి 11గంటల సమయంలో పోలీస్‌స్టేషన్‌కు ఫిర్యాదు చేయడానికి రాగా సెంట్రీ డ్యూటీలో ఉన్న కానిస్టేబుల్ ఈ విషయాన్ని స్టేషన్ ఇన్‌ఛార్జిగా ఉన్న ఏఎస్ఐ షణ్ముగానికి ఫోన్ ద్వారా తెలియజేశాడు. మరుసటి రోజు వచ్చి ఫిర్యాదు చేయాలని చెప్పాడు.సోమవారం సాయంత్రం కేసు నమోదు చేశారు. అయితే కేసు నమోదు విషయంలో షణ్ముగం నిర్లక్ష్యం చూపాడంటూ ఎస్పీ సుబ్బరాయుడికి బాధితులు ఫిర్యాదు చేశారు.ఫిర్యాదు స్వీకరించి విచారణ జరపకుండా నిర్లక్ష్య ధోరణితో వ్యవహరించాడం, పై అధికారులకు తెలియజేయకుండా బాధ్యతారాహిత్యంగా వ్యవహరించడమనే కారణాలతో ఏఎస్ఐ షణ్ముగాన్ని ఎస్పీ సుబ్బరాయుడు సస్పెండ్ చేశారు. విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఎవరిపైన అయినా కఠిన చర్యలు తప్పవని ఎస్పీ హెచ్చరించారు.

నడిరోడ్డుపై పసికందు






నాయుడుపేట టౌన్/ఓజిలి, ఆగస్టు 22 : ఓజిలి మండలం జోశ్యులవారికండ్రిగ సమీపాన ఉన్న మైలురాయి వద్ద నడిరోడ్డుపై అప్పుడే పుట్టిన పసికందును ఎవరో వదిలేసి వెళ్లిపోయారు. గురువారం బహిర్భూమికి వెళ్లిన సుబ్రహ్మణ్యం అనే వ్యక్తికి పసికందు ఏడుపు వినిపించింది. మైలురాయికి వెనుకవైపు గుడ్డల్లో చుట్టి ఉన్న ఓ పసికందు అతని కంటపడింది. ఆ పసికందును అతను నాయుడుపేట ప్రభుత్వ వైద్యశాలకు తీసుకువెళ్లాడు. బొడ్డుకూడా కొయ్యని ఆ పసికందుకు వారు వైద్యం అందించారు. స్థానిక పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులతోపాటూ ఐసీడీఎస్ సీడీపీవో ఉమామహేశ్వరి ఆస్పత్రికి చేరుకొన్నారు. పసికందు ఆరోగ్యం నిలకడగా ఉండడంతో గురువారం రాత్రి నాయుడుపేట ప్రభుత్వ వైద్యశాలలో ఉంచి శుక్రవారం ఉదయం చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ద్వారా శిశు గృహకు తరలిస్తున్నట్లు సీడీపీవో ఉమామహేశ్వరి తెలిపారు.

రూ.50 లక్షల లిక్విడ్ గంజాయి స్వాధీనం

తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు 22: తిరుపతిలో పోలీసులు దాదాపు 50 లక్షల విలువ చేసే లిక్విడ్ గంజాయిని గురువారం మధ్యాహ్నం ఓ కారుతో పాటు స్వాధీనం చేసుకున్నారు. తిరుపతి రూరల్ సీఐ సాదిక్ ఆలి తెలిపిన వివరాల మేరకు.. కేఎల్71-డీ 3686 నెంబరుతో ఉన్న కారులో లిక్విడ్ గంజాయి భారీ ఎత్తున తీసుకెళుతున్నారని పోలీసులకు ముందస్తు సమాచారం అందింది. దీంతో ఎస్పీ సుబ్బరాయుడు ఆదేశాలతో రూరల్ సీఐతోపాటు ఎస్ఐలు షేక్ షావలి, నాగేంద్రబాబు తమ సిబ్బందితో కలసి నాయుడుపేట- పూతలపట్టు జాతీయ రహదారిపై వాహనాలు తనిఖీ చేస్తున్నారు. చిత్తూరు వైపు వెళుతున్న ఈ కారులోని వారు పోలీసులను చూసి పరారవడానికి ప్రయత్నించారు. పోలీసులు వెంబడించడంలో కారును రామానుజపల్లె సర్కిల్ వద్ద వదిలి, అందులోని ముగ్గురు పరారయ్యారు. కారును పరిశీలించగా డిక్కీ, డ్రైవర్ సీటు వెనుక లిక్విడ్ గంజాయి మూటలు బయటపడ్డాయి. వీటి విలువ సుమారుగా రూ.50 లక్షలు ఉంటుందని పోలీసులు తెలిపారు. పరారైన ముగ్గురు నిందితుల కోసం ప్రత్యేక బృందాలతో గాలిస్తున్నారు. ఈ తనిఖీల్లో ఏఎస్ఐ రాఘవ, తదితరులు పాల్గొన్నారు.



లిక్విడ్ గంజాయిని మీడియాకు చూపుతున్న సీఐ సాదిక్ అలి

ఇసుక కోసం వినియోగదారులు ఇక పడిగాపులు కాయాల్సిన అవసరం లేదు. ప్రజల ఇబ్బందులను గుర్తించి ప్రభుత్వం కీలకమైన నిర్ణయాలు చేసింది.ఈ వివరాలను కలెక్టర్ వెంకటేశ్వర్ ఎస్పీ సుబ్బరాయుడితో కలిసి గురువారం కలెక్టరేట్‌లో మీడియాకు తెలిపారు. - తిరుపతి(విద్య)



ఇసుక కోసం ఇక పడిగాపులు అక్కర్లేదు

● 10 సచివాలయాల్లో బుక్ చేసుకునే అవకాశం ● వాహనం రకం, రీచ్ నుంచి దూరాన్నిబట్టి రవాణా చార్జీలు

ముందస్తు బుకింగ్ చేసుకోవాలి

ఇసుక కావాల్సినవారు నేరుగా డిపోలకు వచ్చి ఇసుకను తీసుకెళ్లడానికి అవకాశం లేదు. ముందుగానే బుక్‌చేసుకోవాల్సి ఉంటుంది. ఇందుకోసం జిల్లావ్యాప్తంగా 10 సచివాలయాలను అధికారులు గుర్తించారు. వీటిలో తిరుపతి అర్బన్ మధురానగర్2, తిరుపతి రూరల్ మల్లంగుట, పుత్తూరు ఎన్‌జీవో కాలనీ, శ్రీకాళహస్తి ఎంఎం వాడ2, నాగాలాపురం సురుటుపల్లి, సత్యవేడు కలమనాయుడుపేట, పిచ్చాటూరు కీలపూడి, వెంకటగిరి ఎన్ఆర్ కాలనీ, గూడూరు బొగ్గుల దిబ్బ వీధి, సూళ్లూరుపేట నాగరాజపురంలోని సచివాలయాలు ఉన్నాయి. జిల్లాలో ఎవరు ఎక్కడి నుంచైనా ఏ డిపో పరిధిలోనైనా బుక్ చేసుకోవచ్చు. ఇసుక కావాల్సిన వ్యక్తి లేదా అతడి తరపున వేరొకరు కానీ ముందురోజే ఈ సచివాలయాల వద్దకు వచ్చి బుక్ చేసుకోవాలి. ఇలా బుక్ చేసుకున్నాక ఓ టైమ్ స్లాట్ ఇస్తారు. అందులో సూచించిన తేదీ, టైమ్ ప్రకారం ముందుగా నమోదు చేసిన వాహనంతో రీచ్ వద్దకు వచ్చి ఇసుకను తీసుకెళ్లొచ్చు. బుకింగ్‌ని ఒకటి, రెండ్రోజుల్లో అందుబాటులోకి తెస్తామని కలెక్టర్ తెలిపారు.

ప్రభుత్వానికి ఎటువంటి ఆదాయం ఉండదు

ప్రభుత్వం ప్రకటించిన ఉచిత ఇసుక పాలసీ ప్రకారం.. అడవి కోయంబేడులో 2, సుబ్బనాయుడు కండ్రిగ, వెంకటగిరి, సూళ్లురుపేటల్లో ఒకటి చొప్పున మొత్తం ఐదు స్టాక్ పాయింట్లలో లక్షా 90వేల మెట్రిక్ టన్నుల ఇసుక ఉండేదన్నారు. రెండు నెలల్లో లక్షా 16వేల మెట్రిక్ టన్నుల ఇసుకను విక్రయించినట్టు వెల్లడించారు. ఇందులో ప్రభుత్వానికి ఎటువంటి ఆదాయం లేదని కలెక్టర్ స్పష్టం చేశారు.

లక్ష మెట్రిక్ టన్నుల కొత్త రీచ్ గుర్తింపు

అడవి కోయంబేడులో మాత్రమే 83వేల మెట్రిక్ టన్నుల ఇసుక అందుబాటులో ఉంది. ఈ పాయింటు నుంచి దూరపు ప్రాంతాలవారికి రవాణా ఖర్చు ఎక్కువైపోతోందని మీడియాలో కథనాలు వస్తున్న నేపథ్యంలో నాయుడుపేట కలవకూరు గ్రామం పాలిచర్ల ఆనకట్ట వద్దలో లక్ష మెట్రిక్ టన్నుల ఇసుకను గుర్తించారు. రెండు వారాల్లోగా ఈ రీచ్‌ను అందుబాబులోకి తీసుకురానున్నారు. ఈ రీచ్ ప్రారంభమైతే శ్రీకాళహస్తి తదితర ప్రాంతాలకు అందుబాటులో ఉంటుంది. రవాణా చార్జీలు తగ్గుతాయని కలెక్టర్ చెప్పారు.

సమస్యలపై 0877-2999077 నెంబరుకు ఫిర్యాదు చేయొచ్చు

కొన్నిచోట్ల అక్రమ శాండ్ మైనింగ్ జరుగుతోందని, ముందు వచ్చిన వారికంటే వెనుక వచ్చినవారికి ఇసుకను ఇస్తున్నారనే విషయాలు మా దృష్టికి వచ్చాయి. అంతేకాకుండా డిపోల్లో అధిక ధరలు తీసుకుంటున్నారని, రోజుల తరబడి పడిగాపులు కాయాల్సి వస్తుందని కూడా తెలిసింది. తాజాగా ప్రభుత్వం తెస్తున్న నూతన విధానం వల్ల ఈ ఇబ్బందులు ఉండవు. అలాగే ఏరకం వాహనం అనేదాన్ని బట్టి కిలోమీటర్ల వారీగా రవాణా చార్జీలు ఉంటాయి. కేవలం బుక్ చేసుకున్న వాహనం మాత్రమే తీసుకురావాలి. ఇతర వాహనాన్ని అనుమతించరు. అలాగే అక్రమ ఇసుక, ఇతర ఇబ్బందులను నిర్మూలించేందుకు జిల్లా కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశాం. 0877-2999077 నెంబరుకు కాల్‌చేసి ప్రజలు ఫిర్యాదు చేయొచ్చని సూచించారు. అలాగే 18004256035 టోల్ ఫ్రీ నెంబరుకు ఫోన్ చేసి రాష్ట్ర కంట్రోల్ రూమ్‌కు కూడా ఫిర్యాదు చేయొచ్చని కలెక్టర్ వివరించారు.

సెప్టెంబరులో కొత్త పాలసీ

ప్రస్తుతం అమల్లో ఉన్న ఇసుక పాలసీ సెప్టెంబరు 11వ తేదీవరకు ఉంటుంది. ఆ తర్వాత కొత్తపాలసీని ప్రభుత్వం ప్రకటించే అవకాశం ఉందని కలెక్టర్ తెలిపారు. జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో.. పట్టా భూముల్లో కూడా ఇసుక మేటలు వేసి ఉందని, ఇలాంటి వాటిపైకూడా పాలసీని ప్రభుత్వ ప్రకటిస్తుందని చెప్పారు.

అక్రమ తవ్వకాలపై కఠిన చర్యలు

ఇసుక అక్రమ తవ్వకాలపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ సుబ్బారాయుడు హెచ్చరించారు. స్టాక్ పాయింట్ల వద్ద పోలీసులు, ఎక్సైజ్, రెవెన్యూ, ఎస్ఈబీ, మైనింగ్ అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తారని, ఎక్కడా అవకతవకలు లేకుండా చర్యలు తీసుకుంటారని చెప్పారు. అక్రమ తవ్వకాలు, ఇతర సమస్యలపై జిల్లా, రాష్ట్ర కంట్రోల్ రూమ్‌లకు ఫిర్యాదు చేయాలని సూచించారు.

రెండు నెలల్లో 136 కేసులు : రెండు నెలల్లో సెబ్, పోలీసులు అధికారులు ఇసుకకు సంబంధించి జిల్లాలో 136 కేసులు నమోదు చేయగా 191 మందిని అరెస్ట్ చేశారు. 786 టన్నుల ఇసుకను, 179 వాహనాలను సీజ్ చేశారు.

కిలోమీటర్లు, టన్నులను బట్టి ధరలు రూపాయల్లో

నెం	- కిలోమీటర్లు	- ట్రాక్టర్ 4టన్నులు	- 6 వీలర్ 10 టన్నులు	- 10 వీలర్ 18 టన్నులు	- 12 వీలర్ 23 టన్నులు
1	0-5	800	-	-	-
2	5-10	1000	-	-	-
3	0-10	-	1800	2600	3500
4	11-20	1500	3000	4000	5000
5	21-30	2500	3500	5500	6500
6	31కి.మీపైన ప్రతీ కి.మీకి	-	90	150	175

- *0 నుంచి 10 కిలో మీటర్ల లోపు దూరానికి ఇసుక రవాణా చేసేందుకు కేవలం ట్రాక్టర్లకు, 4 టన్నులలోపు మాత్రమే అనుమతి. 6, 10, 12 వీలర్లకు అనుమతి లేదు.*
- *30 కిలోమీటర్లకు పైబడిన దూరానికి ఇసుక రవాణా చేసేందుకు ట్రాక్టర్లకు అనుమతి లేదు. 30 కిలోమీటర్ల పైబడిన దూరానికి 6, 10, 12 వీలర్ వాహనాల్లోనే 10, 18, 23 టన్నుల వంతున రవాణా చేసుకోవచ్చు.*
- *31 కిలో మీటర్ల దూరం నుంచి ప్రతీ కిలో మీటరుకు 6 వీలర్‌కు రూ. 90, 10 వీలర్‌కు రూ. 150, 12 వీలర్‌కు రూ. 175 చొప్పున చెల్లించాల్సి ఉంటుంది.*

పాఠశాలలో ప్రమాదం

● పాత ఫర్నిచర్ దగ్ధం, రూ.లక్ష ఆస్తి నష్టం

● విద్యార్థులకు తప్పిన పెను ప్రమాదం



తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు 22: ఓ పాఠశాలలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్నిప్రమాదం జరిగింది. పాత ఫర్నిచర్ దగ్ధమైంది. సకాలంలో అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను ఆర్పేయడంతో విద్యార్థులకు పెను ప్రమాదం తప్పింది. స్థానికులు, అగ్నిమాపక శాఖ అధికారులు తెలిపిన వివరాల మేరకు.. బైరాగిపట్టెడలోని సోక్రటీస్ పాఠశాలలో గురువారం ఉదయం తరగతులు జరుగుతున్న సమయంలో అకస్మాత్తుగా భవనం నాల్గవ అంతస్తు నుంచి మంటలు ఎగసిపడ్డాయి. ఉపాధ్యాయులు, సిబ్బంది భవనంపైకి వెళ్లి చూడగా.. అక్కడున్న గదిలో వాటర్ సరఫరా కోసం ఏర్పాటు చేసిన మోటారు వైర్లలో షార్టుసర్క్యూట్ జరిగి మంటలు చెలరేగినట్లు గుర్తించారు. అక్కడున్న పాత ఫర్నిచర్, చిత్తు కాగితాలకు మంటలు వ్యాపించాయి. ఈ సమాచారం అందుకున్న అగ్నిమాపక అధికారులు వెంటనే ఫైరింజన్‌తో ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేయడంతో విద్యార్థులకు ప్రమాదం తప్పింది. అప్పటికే విద్యార్థులను పాఠశాల తరగతి గదుల నుంచి బయటకు పంపేశారు. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులూ పాఠశాల వద్దకు చేరుకున్నారు. పిల్లలు సురక్షితంగా ఉండటంతో ఇళ్లకు తీసుకెళ్లిపోయారు. కాగా, పాఠశాలలో ఫైర్ ఫైటింగ్ పరికరాలు లేకపోవడంపై అగ్నిమాపక సిబ్బంది అసంతృప్తి వ్యక్తం చేశారు.



మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

గూడూరు
సూళ్లూరుపేట/వెంకటగిరి

గూడూరులో కుక్కల బెడద



గూడూరు, ఆగస్టు 22: పట్టణంలోని పలు ప్రాంతాల్లో వీధికుక్కల సంచారం అధికమవడంతో స్థానికులు భయాందోళన చెందుతున్నారు. మున్సిపల్ అధికారులు వీధికుక్కల నియంత్రణకు చర్యలు చేపట్టకపోవడంతో కుక్కల సంచారం పెరిగిపోయిందని స్థానికులు చెబుతున్నారు. ప్రధానంగా పాతబస్టాండు, టవర్‌క్లాక్ సెంటర్, ఐసీఎస్ రోడ్డు, మసీదు వీధి, అశోక్‌నగర్, మాళవ్యానగర్, గాంధీనగర్, పాత బస్టాండు, చెన్నూరు తదితర ప్రాంతాల్లో కుక్కల బెడద అధికంగా ఉంది. ఇటీవల మసీదువీధికి చెందిన ఆరేళ్ల చిన్నారి రాత్రి వేళ శివాలయం వీధిలో ఆటలాడుకుని ఇంటికి వెళుతుండగా ఓ వీధికుక్క దాడి చేయడంతో గాయాలపాలైంది. అధికారులు స్పందించి వీధికుక్కల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

రహదారుల పక్కనే వ్యర్థాల పారవేత



తడ, ఆగస్టు22: తడ మండలంలోని పరిశ్రమలు, సంస్థలు తమ వ్యర్థాలను గుట్టుచప్పుడు కాకుండా రోడ్ల పక్కనే పారవేస్తున్నాయి. పంచాయతీ అధికారులు కొన్ని సార్లు వాటిని పట్టుకుని జరిమాన విధించినా వారిలో మార్పురాలేదు. తాజాగా ఓ పరిశ్రమలో నిరుపయోగంగా ఉన్న ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ అట్టలను భీములవారిపాళెం చెక్‌పోస్టుకు సమీపం నుంచి మాంబట్టు సెజ్ రోడ్డు వరకు ఉన్న జాతీయ రహదారి వెంబడి పలుచోట పారబోశారు. ఇలా వ్యర్థాలను పారవేస్తున్న పరిశ్రమలు, సంస్థలను గుర్తించి అధికారులు కఠిన చర్యలు తీసుకోవాల్సి ఉంది.

వేగంగా వెంకటగిరి-గూడూరు రోడ్డు నిర్మాణం



వెంకటగిరి, ఆగస్టు 22 : ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలు ఒక్కొక్కటిగా నెరవేరుస్తున్నారు. రూ.35 కోట్లతో వెంకటగిరి-గూడూరు రోడ్డు నిర్మాణ పనులు మొదలయ్యాయి. వెంకటగిరి నుంచి బాలాయపల్లి వరకు ఈ రోడ్డు నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయి. గతంలో ఈ రోడ్డు నిర్మాణం పనులు చేపట్టిన కాంట్రాక్టర్ బిల్లులు రావన్న భయంతో పనులను అర్ధాంతరంగా ఆపేశారు. అదేవిధంగా రాపూరు-గూడూరు మధ్య రోడ్డు నిర్మాణ పనులు దాదాపుగా పూర్తి కావస్తుండటంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఉపాధ్యాయుల సర్దుబాటుపై కౌన్సెలింగ్

కోట, ఆగస్టు 22 : కోటలోని విద్యావనరుల కేంద్రంలో గురువారం పని సర్దుబాటుపై ఉపాధ్యాయులకు ఎంఈవో మస్తానయ్య గురువారం కౌన్సెలింగ్ నిర్వహించారు. మండలంలోని 5 మంది ఉపాధ్యాయులకు గాను ఇద్దరు ఊనుగుంటపాళెం పాఠశాలకు ఒక్కరు గోవిందపల్లి పాఠశాలకు పనిసర్దుబాటు కింద బదిలీ కాగా, మరో ఇద్దరు ఉపాధ్యాయులు డివిజన్‌స్థాయి బదిలీలకు కోరుకున్నట్లు ఎంఈవో తెలిపారు. ఈ మేరకు వర్క్ అజిస్ట్‌మెంట్ ప్రక్రియను పూర్తి చేసినట్లు ఆయన తెలిపారు.

భూ పరిహారం చెల్లింపుపై గ్రామసభ

చిల్లకూరు, ఆగస్టు 22: మండలంలోని లింగవరం సచివాలయంలో గురువారం చెన్నై-బెంగుళూరు కోస్టల్ కారిడార్ భూముల సాగుదారులకు పరిహారం చెల్లింపుపై రెవెన్యూ అధికారులు గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దారు శ్రీనివాసులు మాట్లాడుతూ తమ్మినపట్నం, గుమ్మళ్లదిబ్బ, లింగవరం, పల్లివానిదిబ్బ, తీగపాళెం, తాళ్లబైట, గోనుగుంట గ్రామాల్లో కోస్టర్ కారిడార్‌కు కేటాయించిన 914 ఎకరాల భూముల్లో సర్వేచేసి సాగుదారుల జాబితాను గ్రామసభలో వెల్లడించామన్నారు. అభ్యంతరాలుంటే తెలపాలని సాగుదారులకు సూచించామన్నారు. దీంతో విస్తీర్ణంలో తేడా వచ్చిందని, పేర్లు మార్పు జరిగాయని పలువురు సాగుదారులు అర్జీల రూపంలో అభ్యంతరాలను వ్యక్తం చేశారన్నారు. వాటిపై మరల సర్వే నిర్వహించనున్నామన్నారు. కార్యక్రమంలో గూడూరు, చిట్టమూరు, వాకాడు మండలాల డిప్యూటీ తహసీల్దార్లు సురేంద్ర, విజయలక్ష్మి, సందీప్, నిరంజన్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

24న గంధ మహోత్సవం

గూడూరు అర్బన్, ఆగస్టు 22: స్థానిక దర్గావీధిలోని హజరత్‌సయ్యద్‌జాఫర్ మస్తాన్ ఔలియా దర్గాలో శనివారం గంధ మహోత్సవం నిర్వహించనున్నట్లు ముజావర్ మగ్దూం గురువారం తెలిపారు. గంధమహోత్సవం సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు ఉంటాయని తెలిపారు. అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

చిట్టమూరులో భారీ వర్షం

చిట్టమూరు, ఆగస్టు 22 : చిట్టమూరు మండలంలో గురువారం సాయంత్రం భారీ వర్షం పడింది. అరగంట పాటు కురిసిన వర్షంతో పొలాల్లో నీళ్లు నిలిచిపోయాయి. చిట్టమూరు, మెట్టు, ఈశ్వరవాక, గునపాడు, గునపాటిపాళెం గ్రామాల్లో వరి పంటలు కోత దశలో ఉండడంతో రైతులు ఉక్కిరిబిక్కిరయ్యారు. మండలంలో కొన్ని గ్రామాల్లో మాత్రమే భారీ వర్షం పడింది.

రేపు చిట్టమూరు మండల సమావేశం

చిట్టమూరు, ఆగస్టు22: ఈనెల 24న మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో సాలెడ్ తెలిపారు. శనివారం ఉదయం 10గంటలకు చిట్టమూరు స్త్రీ సంక్షేమ భవనం మీటింగ్ హాల్లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశానికి ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అన్ని శాఖల అధికారులు పాల్గొనాలని తెలిపారు.

నేడు ఓజిలిలో గ్రామసభలు

ఓజిలి, ఆగస్టు 22 : ఓజిలి మండలంలో శుక్రవారం గ్రామ సభలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రజనీకాంత్ తెలిపారు. ఆయా పంచాయతీలలో సర్పంచుల అధ్యక్షతన ఈ సభలు నిర్వహించనున్నామన్నారు. గ్రామ సమస్యలతోపాటు ఉపాధిహామీ పథకంపై కూడా చర్చలు, సమీక్షలు ఉంటాయని తెలిపారు. సంబంధిత కార్యదర్శులు, అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు.

జనసేన గ్లాసుల పంపిణీ

కోట, ఆగస్టు 22 : కోట పట్టణంలోని పలు టీ దుకాణాలకు గురువారం జనసేన పార్టీ గుర్తు అయిన టీ గాజు గ్లాసులను గురువారం కూటమి నాయకులు పంపిణీ చేశారు. ఈ మేరకు జనసేన జిల్లా కార్యవర్గ సభ్యుడు అల్లంబాబు, టీడీపీ నియోజకవర్గ అధికార ప్రతినిధి డాక్టర్ తిరుమలశెట్టి కోటేశ్వరరావు ఆధ్వర్యంలో బజారుసెంటర్, ఆర్టీసీ సెంటర్, క్రాస్‌రోడ్డు సెంటర్లలో టీ గాజు గ్లాసులను ఉచితంగా పంపిణీ చేశారు.

రోగులకు చీరల పంపిణీ

కోట, ఆగస్టు 22 : కోట ఆసుపత్రిలో గురువారం మహిళా రోగులకు షిరిడీ సాయిబాబా అక్షయ సేవాసమితి ఆధ్వర్యంలో చీరలు పంపిణీ చేశారు. చెన్నైకు చెందిన ప్రముఖ వ్యాపారి నాగలాపురం గిరిధర్‌రెడ్డి - మహేశ్వరమ్మల దాతృత్వంతో ఈ చీరలను మహిళా రోగులకు అందజేశారు. అదేవిధంగా నెల్లూరుకు చెందిన రాపూరు చంద్రాచారి దాతృత్వంతో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సమితి అధ్యక్షుడు అల్లం రమణయ్య, ఆవుల సుబ్బయ్య, మారం బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఐకి టీడీపీ నేతల అభినందన



కోట, ఆగస్టు22: కోట పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ పవన్ కుమార్‌ను గురువారం టీడీపీ నాయకులు శాలువాలు, మెమెంటోలతో అభినందించారు. టీడీపీ మైనార్టీసెల్ అధ్యక్షుడు మస్తాన్ బాషా, వెంకన్నపాళెం సర్పంచ్ మధుయాదవ్, నాయకులు రాజ్‌కిషోర్, యల్లశిరి వెంకటేశ్వర్లు, ప్రముఖ వ్యాపారి రాయపు సుబ్రహ్మణ్యం (మణి)లు ఎస్ఐను అభినందించారు.

అటకెక్కిన ఆధునికీకరణ పనులు

బిల్లులు రాక కాలువ పనులు ఆపేసిన కాంట్రాక్టర్లు





సూళ్లూరుపేటలో కోతకు గురైన నెర్రికాలువ కాంక్రీట్, కాలువలో వ్యర్థాలు, పిచ్చిమొక్కలు

సూళ్లూరుపేట, ఆగస్టు22: వైసీపీ పాలనలో జలవనరుల శాఖలో ఆధునికీకరణ పనుల్లో తీవ్ర జాప్యం జరిగింది. నాలుగేళ్ల కిందట మంజూరైన పనులను ఎక్కడికక్కడే కాంట్రాక్టర్లు నిలిపివేశారు. ఆరంభంలో పనులు ప్రారంభించి కొంతమేర చేసినా బిల్లులు రాకపోవడంతో పనులు ఆపేసి యంత్ర పరికరాలు సైతం తరలించేశారు. దీంతో ఈ ప్రాంతంలో రైతులు తీవ్రంగా నష్టపోయారు. సూళ్లూరుపేట నియోజకవర్గంలో నాలుగుపనులకు రూ.71.54 కోట్లు మంజూరు చేశారు. అప్పటి జలవనరుల శాఖ మంత్రి అనిల్‌కుమార్ ఇక్కడ పర్యటించి సూళ్లూరుపేట, తడ, దొరవారిసత్రం మండలాల్లో ప్రవహించే నెర్రికాలువ ఆధునికీకరణకు రూ. 27.19 కోట్లు, తడ మండలం ఎన్ఎం కండ్రిగ దగ్గర పాముల కాలువకు రూ.3.96 కోట్లు మంజూరు చేశారు. అంతేకాకుండా 2019లో మంత్రి సూళ్లూరుపేట వినాయకుడి గుడి వద్ద భూమి పూజచేసి ఏడాదిలోపు పూర్తి చేస్తామన్నారు. అదేవిధంగా పెళ్లకూరు మండలం పాలచ్చూరు ఆనకట్ట సిస్టమ్ ఆధునికీకరణకు రూ.31.65 కోట్లు మంజూరు చేశారు. టెండర్లు దక్కించుకొన్న కాంట్రాక్టర్లు పనులు చేపట్టారు.

బిల్లులు రాక ఆగిన నెర్రికాలువ ఆధునికీకరణ

కాళంగి నది అనుసంధానంగా ఉన్న నెర్రికాలువ దొరవారిసత్రం మండలం తనియాలి వద్ద నుంచి సూళ్లూరుపేట, తడ మండలాల్లో 17.5 కి.మీ వరకు విస్తరించి ఉంది. దాదాపు నెర్రికాలువ ద్వారా 20 వేల ఎకరాలకుపైగా సాగునీరందుతోంది. సూళ్లూరుపేట మున్సిపాలిటీకి తాగునీరందించే సమ్మర్ స్టోరేజ్‌కి కూడా ఇదే ఆధారం. ఇలాంటి కాలువ పలుచోట్ల కోతకు గురై వ్యర్థాలతో నిండిపోయి సాగునీరు సక్రమంగా అందడం లేదు. దీని బాగుకోసం అప్పట్లో రూ.27.19 కోట్లు నిధులు మంజూరు చేశారు. దొరవారిసత్ర మండల పరిధిలో రెండు కిలోమీటర్లు, సూళ్లూరుపేట మండలంలో అర కిలోమీటరు మేర సిమెంట్‌తో కాంక్రీట్ గోడ నిర్మించారు. ఈ పనులకు సంబంధించి దాదాపు రూ.2.40 కోట్లు బిల్లులు చెల్లించేందుకు ఇంజినీర్లు మెజర్‌మెంట్ పుస్తకాలు సిద్ధం చేసి 2022లో ప్రభుత్వానికి పంపారు. బిల్లులు రాకపోవడంతో కాంట్రాక్టర్లు పనులు ఆపేశారు. పెళ్లకూరు, నాయుడుపేట, ఓజిలి మండలాలకు మేలుచేసే పాలచ్చూరు ఆనకట్ట సిస్టమ్ లైనింగ్ పనులు 2020 ఆర్థిక సంవత్సరం చివర్లో పనులు మొదలు పెట్టారు. కాంక్రీట్ లైనింగ్, చిన్న వంతెనల నిర్మాణాలు ప్రారంభించి 5 కి.మీ మేర పూర్తిచేసి అర్ధాంతంగా వదిలేశారు. బిల్లులు ప్రభుత్వం చెల్లించకపోవడంతో ఈ సంస్థ పనులు చేయకుండా వెనక్కి వెళ్లింది. ఓజిలి మండలంలో అసలు పనులే మొదలు పెట్టలేదు. గతేడాది డిసెంబరులో వచ్చిన వరదలకు చేసిన పనులు చాలాచోట్ల దెబ్బతిన్నాయి. వర్షపు నీరు కూడా నిలవడం లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు. గత పాలకులు చేసిన తప్పులను సరిచేసి రైతులకు సాగునీరందించే విధంగా ఆగిన ఆధునికీకరణ పనులు పూర్తి చేస్తారని కోటి ఆశలతో రైతులు ఎదురు చూస్తున్నారు.

గ్రామసభలను విజయవంతం చేయాలి





మీడియాతో సమావేశంలో జనసేన నాయకులు, మాట్లాడుతున్న ఎంపీడీవో సురేష్‌బాబు

గూడూరు, ఆగస్టు 22: పంచాయతీరాజ్‌శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించనున్న గ్రామసభల్లో జనసేన శ్రేణులు పాల్గొని విజయవంతం చేయాలని ఆ పార్టీ ఉమ్మడినెల్లూరు జిల్లా ఉపాధ్యక్షుడు తీగల చంద్రశేఖర్ అన్నారు. గురువారం గమళ్లపాళెంలోని జనసేనపార్టీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ శుక్రవారం గూడూరు మండలంలో జరగనున్న గ్రామసభలలో జనసేన నాయకులు టీడీపీ, బీజేపీ నాయకులతో కలిసి పాల్గొనాలన్నారు. కార్యక్రమంలో అక్బర్, క్రాంతి, గోపాల్ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా సినీహీరో చిరంజీవి పుట్టినరోజు సందర్భంగా కేక్‌కట్ చేసి పంచిపెట్టారు.

గ్రామ సభలకు ఏర్పాట్లు పూర్తి

పెళ్లకూరు : మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో శుక్రవారం ఉపాధి హామీ గ్రామసభలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామని ఎంపీడీవో సురేష్‌బాబు తెలిపారు. పెళ్లకూరు ఎంపీడీవో కార్యాలయంలో గురువారం ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం కింద గ్రామసభల ద్వారా ఆమోదించిన పనులను మాత్రమే చేయాలన్నారు.. గ్రామసభలలో పనులను గుర్తించి తీర్మానించడంతోపాటు ఆయా గ్రామాలలో ప్రజలు కోరిక మేరకు చేపట్టాల్సిన అదనపు పనులకు సంబంధించిన వినతి పత్రాలను తీసుకోవాలని సూచించారు. అనంతరం గ్రామసభల నిర్వహణ, మార్గదర్శకాలను వివరించారు. కార్యక్రమంలో ఈవోఆర్డీ విజయమ్మ, ఏపీవో దయానందం, పంచాయతీ కార్యదర్శులు వసంతకుమార్, శ్రీహరి తదితరులు ఉన్నారు.

భక్తులు మెచ్చేలా వెంకటగిరి పోలేరమ్మ జాతర

ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ

వెంకటగిరి, ఆగస్టు 22 :ఈ ఏడాది సెప్టెంబరు నెలలో జరిగే వెంకటగిరి పోలేరమ్మ జాతరను భక్తులు మెచ్చేవిధంగా నిర్వహిస్తామని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అన్నారు. గురువారం ఆయన పోలేరమ్మ పుట్టింటిని సందర్శించి జాతర ఏర్పాట్లపై అధికారులతో చర్చించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ పోలేరమ్మ జాతరను ప్రభుత్వం రాష్ట్ర పండుగగా ప్రకటించిందన్నారు. పట్టణంలోని అన్ని వార్డుల్లో పర్యటించి ప్రజల సమస్యలను తెలుసుకుని పరిష్కారం కోసం కృషి చేస్తామన్నారు. వార్డుల్లో మంచినీటి వసతి, రోడ్లు, డ్రయిన్లు, పారిశుధ్య పరిస్థితులు చక్కదిద్దడం వంటి పనులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. వ్యవసాయ మార్కెటింగ్ మాజీ చైర్మన్ పులికొల్లు రాజేశ్వరరావు, రాష్ట్ర తెలుగు యువత అధ్యక్షుడు కేవీకే ప్రసాద్ నాయుడు, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ బీరం రాజేశ్వరరావు, పట్టణ మాజీ అధ్యక్షుడు మంకు ఆనంద్, బీసీ నాయకులు అవ్వారు సత్యనారాయణ, చంద్రారెడ్డి, నరసింహులు పాల్గొన్నారు.



పోలేరమ్మ జాతర ఏర్పాట్లపై మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామకృష్ణ

విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టాలి



కళాశాలలో వసతులను పరిశీలిస్తున్న తహసీల్దార్ శ్రీనివాసులు

డక్కిలి, ఆగస్టు 22: విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించడంతోపాటు పరిసరాల పరిశుభ్రతను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని తహసీల్దార్ శ్రీనివాసులు సూచించారు. గురువారం స్థానిక బాలకల గురుకుల కళాశాలను సందర్శించిన ఆయన మరుగుదొడ్లు, వంటశాల, వసతి గదులు, తరగతి గదులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల ఈ కళాశాలలో ఓ విద్యార్థిని అనారోగ్యంతో చనిపోవడం బాధాకరమన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌కు సూచించారు. విద్యార్థులు సీజనల్ వ్యాధుల బారిన పడకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఇక కళాశాలలో ఆర్వో ప్లాంటు పనిచేయక పోవడాన్ని గుర్తించి వెంటనే ఆర్వో ప్లాంటుకు మరమ్మతులు చేపట్టి విద్యార్థులకు శుద్ధి జలాలను అందించాలని చెప్పారు.

గురుకుల పాఠశాల తనిఖీ

వాకాడు, ఆగస్టు 22 : మండలంలోని వాకాడు సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలలో ఎంపీడీవో వెంకటేశ్వరరావు, ఎంఈవో నసీంఆలీతో కలసి తహసీల్దారు రామయ్య గురువారం రాత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో వసతులు, సౌకర్యాలు, మెనూ తదితర అంశాలపై విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థులకు వండించే భోజన నాణ్యతను పరిశీలించారు. భోజనం మరింత రుచికరంగా వండేలా చూడాలని ఆదేశించారు. మెనూ ప్రకారం భోజనాన్ని అందించాలని సూచించారు. వారంరోజుల్లో మరోసారి పాఠశాలను తనిఖీకి వస్తామన్నారు. పాఠశాలలో పారిశుధ్య కార్యక్రమాలను చేపట్టాలన్నారు. వైస్ ప్రిన్సిపాల్ విజయ్, సిబ్బంది ఉన్నారు.



భోజన నాణ్యతను పరిశీలిస్తున్న తహసీల్దారు రామయ్య

రైల్వేస్టేషన్‌లో మౌలిక వసతులు కల్పించండి

● డీఆర్ఎం విశ్వనాథ్‌కు ఆర్యవైశ్య సంఘ నాయకుల వినతి



ప్రయాణికులతో మాట్లాడుతున్న డీఆర్ఎం

నాయుడుపేట/టౌన్, ఆగస్టు 22 : నాయుడుపేట రైల్వేస్టేషన్‌లో మౌలిక వసతులు కల్పించాలని రైల్వే డీఆర్ఎం విశ్వనాథ్‌కు ఆర్యవైశ్య సంఘ నాయకులు వినతిపత్రం అందజేశారు. గురువారం నాయుడుపేట రైల్వేస్టేషన్‌ను డీఆర్ఎం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అదే సమయంలో స్టేషన్‌లో తాగునీటి వసతి లేకపోవడం, చెత్తబుట్టల నిర్వహణ సక్రమంగా లేకపోవడంతోపాటు స్టేషన్ ఆవరణలో నిబంధనలను అతిక్రమించి వాహనాలు పార్కింగ్ చేసి ఉండటాన్ని డీఆర్ఎం అసహనం వ్యక్తం చేశారు. రద్దు చేసిన రైళ్లను పునరుద్ధరించాలని, అదనపు కౌంటర్‌ను ఏర్పాటు చేయాలని ఆర్యవైశ్యసంఘ నాయకులు డీఆర్ఎంను కోరారు.

మహా చండీ హోమం



అన్నదానం చేస్తున్న ప్రకృతికుమార్

వెంకటగిరిటౌన్, ఆగస్టు 22: పట్టణంలోని 3వ వార్డులో వెలసిన విష్ణుదుర్గాపరమేశ్వరి శక్తిపీఠంలో స్వామి వివేకానంద యువ సైన్యం ఆధ్వర్యంలో గురువారం మహాచండీ హోమం నిర్వహించారు. నిర్వహకులు ప్రకృతికుమార్ మాట్లాడుతూ వెంకటగిరిలో అందరూ సుభిక్షంగా ఉండాలని హోమం చేశామన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

ఎమ్మెల్యేను కలిసిన మాజీ ఎంపీ



గూడూరు, ఆగస్టు 22: ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్‌ను ఆయన నివాసంలో గురువారం మాజీ ఎంపీ వరప్రసాద్‌రావు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని పలు అభివృద్ధి పనులపై ఎమ్మెల్యేతో చర్చించారు. కార్యక్రమంలో నరసప్ప, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

బాలసదనంలో చిరంజీవి పుట్టినరోజు సంబరాలు



కోట, ఆగస్టు22 : పట్టణంలోని బాలసదనం, కారు స్టాండ్ సెంటర్లలో గురువారం సినీ నటుడు చిరంజీవి జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. బాలసదనంలో చిరంజీవి అభిమానులు కేక్ కట్‌చేసి ఎస్ఐ పవన్‌కుమార్ చేతులమీదుగా చిన్నారులకు పంచిపెట్టారు. అభిమానులు అల్లంబాబు, కోటేశ్వరరావు, మల్లికార్జున్‌రావు తదితరులు పాల్గొన్నారు.

మద్యం బాటిళ్ల పట్టివేత



పెళ్లకూరు, ఆగస్టు 22 : మండలంలోని పుల్లూరుకు చెందిన ఎం.దుర్గారావు, ప్రసాద్‌లు మద్యం తరలిస్తుండగా పోలీసులకు పట్టుబడ్డారు. ఎస్ఐ శ్రీకాంత్ సమాచారం మేరకు... కలవకూరు-పుల్లూరు గ్రామాల మధ్య తన సిబ్బందితో పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా ఇద్దరు వ్యక్తులు ద్విచక్ర వాహనంలో అనుమానాస్పదంగా వెళుతూ కనిపించారు. దీంతో ఎస్ఐ శ్రీకాంత్ వారిని నిలిపి పరిశీలించగా వారి వద్ద 21 మద్యం బాటిళ్ళు ఉండడాన్ని గమనించారు. వాటిలో 8 రాయల్ స్టాగ్ ఫుల్ బాటిళ్లు, 10 కింగ్స్‌వెల్ క్వార్టర్లు, మూడు బీర్లు ఉన్నాయి. మద్యం బాటిళ్ళతోపాటు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఆడపిల్లలను కాపాడుకుందాం

కోట, ఆగస్టు 22 : ఆడ పిల్లలకు చిన్నవయసులోనే వివాహాలు చేసి వారి ఆయుష్షును హరించే సంప్రదాయాన్ని తరిమికొడదామంటూ సీడీపీవో మునికుమారి పిలుపునిచ్చారు. కోట బాలికోన్నత పాఠశాలలో గురువారం బాల్య వివాహాల నిర్మూలన, బేటీ బచ్చావో... బేటీ పడావో... కార్యక్రమాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఆడబిడ్డ వివాహం చేసుకోవాల్సి ఉండగా, గ్రామాల్లో అనాగరికత సంస్కృతి, సంప్రదాయాలకు గ్రామీణులు ఆజ్యం పోస్తున్నారన్నారు. ఇలాంటి సంప్రదాయాలను ప్రతి ఆడపిల్ల వ్యతిరేకించి తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. బాల్య వివాహాల వల్ల కలిగే నష్టాలకు సంబంధించిన పోస్టర్లను సీడీపీవో, సూపర్‌వైజర్ కృష్ణమ్మ, ఉపాధ్యాయులు ఆవిష్కరించారు.



మాట్లాడుతున్న సీడీపీవో మునికుమారి